01ATP20F_01ATP20F.qxd 20-12-2025 PM 11:14 Page 1




# అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఆదివారం 21 డిసెంబర్ 2025 పేజీలు : 04


# డ్రగ్స్ వాడకం " మానవ మనుగడకు అనర్థం"

- సత్యసాయి జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చడమే ధ్యేయం
- మత్తుకు బానిస కావద్దు..భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు
- కదిరిలో డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు పిలుపు





డ్రగ్స్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

**కదిరి, డిసెంబర్ 20 ప్రభాతవార్త**

డ్రగ్స్ వాడకం మానవ మనుగడకు అనర్థమని, సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ లీగల్ విభాగం ఆర్‌కె.రవికృష్ణ సూచనల మేరకు కదిరిలో డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన ర్యాలీ ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్‌పి సతీష్‌కుమార్, ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు డ్రగ్స్ నిర్మూలనలో పోలీసుల వలే బాధ్యతగా వ్యవహరించాలన్నారు. జిల్లాలో అతి తక్కువ ప్రాంతాల్లో డ్రగ్స్ వాడకం కనిపిస్తోందని, వాటిని నిర్మూలించడానికి గట్టి సంకల్పం తీసుకోవడం జరిగిందన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని, ఎక్కడైనా డ్రగ్స్, గంజాయి వాడకం కనిపిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. నేను గంజాయి తీసుకోను-నా ప్రాంతంలోగంజాయి వాడనివ్వనని ప్రతి ఒక్కరు వాగ్ధానం తీసుకోవాలన్నారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, లేదంటే సమాజంలో చిన్న చూపు, కుటుంబంలో కలహాలు, తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటారన్నారు. ప్రతి ఒక్కరు పోలీసులకు తోడుగా ఉంటూ గంజాయి లేని సత్యసాయి జిల్లా చేయడానికి సహకరించాలని కలెక్టర్ కోరారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. డ్రగ్స్ యువత భవిష్యత్తును దెబ్బతీసే తీవ్రమైన సమస్య అని ఎవరు డ్రగ్స్ వాడవద్దన్న సందేశం ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న ఉద్దేశ్యంతో డ్రగ్స్ వద్దు బ్రో అన్న కార్యక్రమం కదిరిలో నిర్వహించామన్నారు. గంజాయి, డ్రగ్స్ వాడటం, అమ్మడం చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి వాడుతున్నట్లు తెలిస్తే 1972, 112 టోల్ ఫ్రీ నెంబర్లకు కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకు కదిరి ప్రాంతంలో 42 మంది గంజాయి కేసుల్లో పట్టుబడటం జరిగిందని, వీరిపై పిడి యాక్టుతోపాటు పట్టణ బహిష్కరణ చేస్తున్నామన్నారు. ఇలాంటి నింధితులపై ప్రత్యేక నిఘా ఉంచడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు చేయి చేయి కలిపి గంజాయి నిర్మూలనకు కృషి చేద్దామని ఎస్పీ పిలుపునిచ్చారు. అనంతరం నిజాంవలి కాలనీలో గంజాయి విక్రయించే వారి ఇళ్ల వద్దకు ఎస్పీ వెళ్లి కౌన్సిలింగ్ నిర్వహించి ఇటువంటి వాటికి స్వస్తి పలకాలని, లేదంటే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు సమయాన్ని కేటాయించి పిల్లల పట్ల ప్రేమగా వ్యవహరించాలని, ఇలా చేయడం వల్ల వారి ప్రేమ పిల్లల పట్ల మత్తుగా ఉంటుందని, వారికి మరో మత్తు అవసరం లేదన్నారు. పిల్లలు తల్లిదండ్రుల వద్ద అధికంగా ఉంటారు కాబట్టి విద్యార్థులను గమనిస్తూ మంచి మార్గంలో నడిపించాలని సూచించారు. విద్యార్థులు కూడా సామాజిక బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. మన తర్వాతి తరాని కూడా మంచి వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రాన్ని, దేశాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్ల వచ్చని తెలిపారు. కాబట్టి ఎవరు మత్తుకు బానిస కావద్దు, మత్తుకు బానిస అయితే అనారోగ్యం పాలు అవుతారని దీనిని గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అవగాహన కార్యక్రమం కంటే ముందు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి అంబేద్కర్ కూడలి వరకు ప్లకార్డులు చేతబూని డ్రగ్స్ వద్దు బ్రో అని నినాదాలు చేస్తూ అంబేద్కర్ కూడలిలో మానవ హారం ఏర్పడి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ అంకిత సురాణి, డిఎస్పీ శివనారాయణస్వామి, సిఐలు నారాయణరెడ్డి, నాగేంద్ర, నిరంజన్‌రెడ్డి, డిటిఆర్‌బి సిఐ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీసా బాహుద్దీన్, స్వచ్ఛాంధ్ర రాష్ట్ర కమిషన్ డైరెక్టర్ పర్వీన్ భాను, స్వచ్ఛ ఒద సంస్థ ప్రతినిధులు, వైస్ చైర్మన్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు కదిరి సబ్ డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## ప్రజల శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు వాహనాలు కీలకం

- ఎమ్మెల్యే కందికుంట సహకారంతో రూ.1.10 కోట్లు విలువ చేసే 8 పోలీసు వాహనాలు, డే విజన్, నైట్ విజన్-2 డ్రోన్ కెమెరాలను ఎస్పీకి అందజేసిన ఎమ్మెల్యే కందికుంట





వాహనాల పూజా కార్యక్రమంలో జిల్లా ఎస్పీ, ఎమ్మెల్యే ,వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తునన జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

**కదిరి, డిసెంబర్ 20 ప్రభాతవార్త**

ప్రజలకు శాంతి భద్రతలు సమర్థవంతంగా పరిరక్షించడంలో పోలీసు వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే కందికుంట సహకారంతో సుమారు 1.10 కోట్లు విలువ చేసే 8 వాహనాలు, నైట్ విజన్, డే విజన్ డ్రోన్‌లు, వాహనాలకు స్థానిక లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం జెండా ఊపి వాహనాలను ఎస్పీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే సంఘటన స్థలానికి చేరుకోవడానికి వాహనాలు ఎంతో అవసరమన్నారు. ప్రజల నుంచి పిజిఆర్‌ఎస్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు త్వరితగతిన స్పందించి సమస్యలు పరిష్కరించాలంటే పోలీసు వాహనాలు కీలకమన్నారు. స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ సహకారంతో పోలీసు శాఖకు సుమారు 1.10 కోట్లు విలువ చేసే వాహనాలు, డే విజన్, నైట్ విజన్ డ్రోన్లు రెండు అందించడం సంతోషకరమన్నారు. తమ సమస్యలను అర్థం చేసుకుని సహకరించిన ఎమ్మెల్యేకు దాతలకు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. డ్రోన్ల నిఘా, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో కీలకంగా ఉపయోగపడుతాయన్నారు. ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. తాను అడిగిన వెంటనే పారిశ్రామిక వేత్తలు, తన స్నేహితులు సిఎస్ఆర్ నిధులు అందించారని, ఆ నిధులతో వాహనాలు, డ్రోన్లు కొనుగోలు చేసి పోలీసు శాఖకు అందించామన్నారు. భవిష్యత్తులో కూడా పోలీసు శాఖకు అన్ని విధాలా సహకరిస్తామన్నారు. కదిరి పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగాఉందని, దానిని పూర్తిగా నివారించడానికి అవసరమైన సహకారం అందిస్తామన్నారు. కదిరిని స్మార్ట్ టెంపుల్ టౌన్‌గా తీర్చి దిద్దేందుకు పోలీసు శాఖకు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎస్పీని కోరారు. పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వం తరుపున తాము ముందుండి అన్ని విధాలుగా సహకరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎస్పీ చేతులు మీదుగా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, దాతలకు దుశ్శాలువాతో, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి అంకితా సురాణి, డిఎస్పీ శివనారాయణస్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీసా బాహుద్దీన్, టిడిపి రాష్ట్రకార్యనిర్వహక కార్యదర్శి పాలవల పవన్‌కుమార్‌రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## నైపుణ్యాభివృద్ధితోనే ఉపాధి అవకాశాలు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

**శ్రీ సత్యసాయి జిల్లా, డిసెంబర్ 20, ప్రభాతవార్త ప్రతినిధి:**

యువత నైపుణ్యాలు అభివృద్ధి పరచుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగు అవుతాయని జిల్లా కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ అన్నారు. పుట్టపర్తిలోని సాంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నాంది ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన 10 రోజుల ఎంప్లాయబిలిటీ స్కిల్స్ శిక్షణ కార్యక్రమం ముగింపు, సర్టిఫికెట్ల ప్రదాన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంబీఏ చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఉపాధి సాధనకు అవసరమైన ఇంటర్వ్యూ స్కిల్స్, ఆర్ట్ ఆఫ్ స్పీకింగ్, సమస్యల పరిష్కారం, ప్రొఫెషనల్ ఎథిక్స్ వంటి నైపుణ్యాలపై పది రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. అలాగే రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలలు మరియు 14 డిగ్రీ కళాశాలల్లో ఎంప్లాయబిలిటీ స్కిల్స్ సెంటర్లు ఏర్పాటు చేసి, డిగ్రీ మొదటి, రెండవ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆఫ్లైన్ ద్వారా ఉచిత శిక్షణ అందించి, క్యాంపస్ ప్లేస్‌మెంట్ల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ శిక్షణలో భాగంగా డేటా సైన్స్, పవర్ బి.ఐ, అడ్వాన్స్‌డ్ ఎంబెడెడ్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ వెహికల్ డిజైన్, స్టాడ్ ప్రో, అడ్వాన్స్ ఎక్సెల్, టాలీ, పైథాన్, అమెజాన్ వెబ్ సర్వీసెస్ వంటి ఆధునిక కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నామని, ఇందుకోసం ప్రభుత్వం దాదాపు రూ.20 లక్షల వరకు వ్యయం చేస్తోందని, శిక్షణ పూర్తిచేసిన వారికి స్కిల్ ఇండియా మిషన్ ద్వారా సర్టిఫికేషన్ అందిస్తున్నామని వివరించారు. అదేవిధంగా జిల్లాలో ప్రతి నెల ప్రతి నియోజకవర్గంలో ఒక మెగా జాబ్ మేళా నిర్వహించి, చదువుకున్న యువతీ యువకులకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ, పిడిడి ఆర్డీఏ నరసయ్య, జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజ, జాబ్ డెవలప్మెంట్ మేనేజర్ సూర్యనారాయణ, సాంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయరహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- కర్ణాటక చిక్‌బళ్ళాపూర్ వాసులైన దంపతుల దుర్మరణం, అపస్మారకస్థితిలో ఇద్దరు
- దట్టంగా అలుముకున్న పొగమంచే ప్రమాదానికి కారణమా..? - సంఘటనా స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ జగదీష్



పోస్టుమార్టం గదిలో ఏ.ఆర్.వెంకటాచార్, గీతమ్మ మృతదేహాలు.



మృతులు ఏ.ఆర్.వెంకటాచార్, గీతమ్మ (ఫైల్‌ఫోటో).



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ జగదీష్

**పామిడి, డిసెంబర్ 20 ప్రభాతవార్త**

పట్టణ శివారు ప్రాంతం నీలూరు క్రాస్ జాతీయరహదారిపై శనివారం వేకువజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకోగా కర్ణాటక చిక్‌బళ్ళాపూర్ వాసులైన ఏ.ఆర్.వెంకటాచార్ (66) అతని బార్య గీతమ్మ (58) దుర్మరణం చెందగా వారి కుమారుడు విష్ణు, డ్రైవర్ నరశింహ తీవ్రగాయాలపాలవ్వగా కోడలు అక్షిత స్వల్పగాయాలతో ప్రమాదం నుండి బయటపడ్డారు. సంఘటనకు సంబందించి మృతుల బందువులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలావున్నాయి.. కర్ణాటక చిక్‌బళ్ళాపూర్ ప్రాంతం మిగతా 4 లో...

# రత్నగిరి పేరులోనే రత్నాలు

- గుప్తనిధుల వేటగాళ్ల తాకిడికి రాళ్ల కుప్పగా మారుతుంది - పురావస్తు శాఖ ప్రభుత్వం సహకరిస్తే సంపదను కాపాడుకొని వెసులుబాటు



రత్నాల గల రత్నగిరి కొండ

**రొళ్ల డిసెంబర్20 ప్రభాతవార్త:**

నవ్యాంధ్ర నైరుతి శిఖరి, అనంత చారిత్రక సిరి.. ధార్మిక నగరి.. రత్నగిరి.అద్భుతమైన కట్టడాలు, అపురూపమైన శిల్ప సంపద, శత్రుదుర్భేద్యమైన కోట, అధునాతనమైన సాంకేతికత..ఇవన్నీ కలిస్తేనే రత్నగిరి కోట. ఇంత ప్రాధాన్యగల కోట శ్రీసత్యసాయి జిల్లా మడకశిర తాలూకా రొళ్ల మండలంలో ఉన్న రత్నగిరికి ఎంతో చరిత్ర ఉంది.సుమారు 1500 సంవత్సరాల క్రితం శాసనాలలో రత్నగిరి కోట ప్రస్తావన ఉంది.అంటే అంతకు ముందే కోట నిర్మాణం జరిగి ఉంటుందని చరిత్రకారుల అంచనా.ఎంతోమంది రాజులు రత్నగిరిని ముఖ్య కేంద్రంగా చేసుకుని పరిపాలన చేసినట్టు చారిత్రక ఆధారాలు ఉన్నాయి.చివరిగా పాలెగాళ్ళు ఈ రాజ్యాన్ని తమ చేతుల్లోకి తీసుకుని తమకుతామే రాజులుగా ప్రకటించుకున్నారు.ఆరో శతాబ్దంలో నలరాజును బాదామి చాళుక్యులు ఓడించి రత్నగిరి రాజ్యాన్ని హస్తగతం చేసుకున్నారు. చాళుక్యులలో రెండో పులకేశి, విక్రమాదిత్య, వినయాదిత్య, విజయాదిత్య, కీర్తివర్మ సుమారు వందేళ్లపాటు పరిపాలించారు. బాదామి చాళుక్యులు, పశ్చిమ గాంగులు, నోళంబులు, విజయనగర సామ్రాజ్యధీశులు, పాళేగాళ్ళు,రాష్ట్ర కూటులు, టిప్పుసుల్తాన్ రత్నగిరిలో పాలన సాగించారు. వీళ్ల మధ్య ఏళ్ళపాటు యుద్ధాలు జరిగాయి. అక్కడక్కడ ఫిరంగి గుళ్ల దాటికి కొన్ని రాళ్లు మాత్రమే చెదిరిపోయాయి తప్ప కోట నిర్మాణం మాత్రం చెక్కు చెదరలేదు. కాని నేడు గుప్తనిధుల వేటగాళ్ల చేతిలో మాత్రం ఛిద్రం అవుతోంది. రాళ్ల కుప్పగా మారుతోంది.కోట అబ్బురపరిచే నిర్మాణం కోటలో రాజమహల్ ఈశాన్య దిక్కున ధనాగారాన్ని నిర్మించారు. రాజ్యం ఓటమిపాలైనా కూడా ధనం శత్రువులకు దొరక కూడదన్న ఉద్దేశంతో పెద్ద రాళ్ళు మధ్య ఎవరూ ఊహించని విధంగా నిర్మించిన తీరు ఆశ్చర్యపరుస్తోంది. అన్ని వేల సంవత్సరాల క్రితమే ఇలా ఆలోచించి నిర్మించడం విశేషం. అత్యంత దృఢంగా కోటగోడను, కోట ముఖ ద్వారాలు నిర్మించారు. చిన్నపాటి మెళకువలతో శతువు కోటలోకి ప్రవేశించేందుకు అష్టకష్టాలు చాలా ప్రణాళిక రూపొందించారు.చక్రవర్తి అయినా టిప్పుసుల్తాన్ కు ఆరు నెలలు యుద్ధం చేయాల్సి వచ్చిందంటే కోట విశిష్టత అర్థం చేసుకోవచ్చు. కోట లోపలే కారాగారం, ధనాగారం, ధాన్యాగారం నిర్మించి యుద్ధ సమయాలలో వినియోగించుకోవడానికి అనుకూలంగా నిర్మించారు. కోటలోపల కొండపైన సహజసిద్ధంగా ఉన్న నీటి నిల్వలకు అదనంగా ప్రహరీలు నిర్మించి, మెట్లు ఏర్పాటుచేసి నీటిని ఉపయోగించుకున్న విధానం అబ్బురపరచకమానదు.పురావస్తు శాఖ,జాడే లేదు రత్నగిరి కోట పేరులోనే రత్నాలు ఉన్నాయని అక్కడ రత్నాలు లభిస్తాయన్న ఊహలతో దేశం నలుమూలల నుంచి గుప్తనిధుల వేటగాళ్లు కోటలో తవ్వకాలు జరుపుతున్నారు.అందమైన శిల్ప సంపదను ధ్వంసం చేస్తున్నారు. వాళ్ల అత్యాశ కోటకు బీటలు వేస్తోంది. భావితరాలకు అందించాల్సిన చారిత్రక సంపద శిథిలావస్థలోకి నెడుతున్నారు. కోటలో ఉన్న శైవ, వైష్ణవ, జైన దేవాలయాలలో విగ్రహాలను సైతం మాయం పహారా.. జాడలేని పురావస్తు శాఖ .. వెరసి రత్నగిరి కోట రాళ్ల కుప్పగా మారిపోతుంది.కోట లోపల నాలుగు రహదారులు కలిసేలా నిర్మాణం ఉంటే వజ్ర వైడూర్య రత్నాలు లభించేందుకు సంకేతాలుగా చరిత్రకారులు చెబుతారు. రత్నగిరి కోటలో కూడా నాలుగు రహదారుల కూడలిగా ఉండడంతో గుప్తనిధుల వేటగాళ్ల తాకిడి పెరిగిపోయింది. వాస్తవంగా రత్నగిరిని శ్రీకృష్ణదేవరాయల వంశస్థులు సంపదను దాచుకోవడానికి ఉపయోగించుకునేవారట. చెక్కు చెదరని కట్టడాలను పరిరక్షించి, భావితరాలకు చారిత్రక సంపదను అందజేసే బాధ్యత అక్కడి యువత తమ భుజాలపై ఎత్తుకుంది. నిరంతరం కాపాడుకుంటుంది. దీనికితోడు పురావస్తు శాఖ, పోలీసులు, ప్రభుత్వం సహకరిస్తే మరికొన్ని వేల సంవత్సరాలపాటు సంపదను కాపాడుకోనే వెసలుబాటు ఉంది. ఆ దిశగా ప్రభుత్వాలు అడుగులు వేయాలని స్థానికులు కోరుతున్నారు.



కోట లోపల్లి చెక్కుచెదరని కట్టడా బావి



గుప్తనిధుల వేటగాళ్లు కోటను పగలగొట్టిన దృశ్యం

## సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ముందుగా క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సురేంద్రబాబు

**కంబదూరు, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

కంబదూరులోని సీ అండ్ ఐజీ మిషన్ చర్చిలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని కేక్ కట్ చేసి క్రైస్తవులకు ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. అంతకముందు చర్చి కమిటీ సభ్యులు, స్థానిక టిడిపీ నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సురేంద్రబాబు మాట్లాడుతూ క్రిస్మస్ ప్రపంచమంతా జరుపుకొనే పవిత్రమైన పండుగని, అందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. చర్చిలో కళ్యాణ మండపం నిర్మాణం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపామని నిధులు మంజూరు కాగానే నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. అనంతరం అంబేద్కర్ భవనం ఏర్పాటు కోసం నిరుపయోగంగా ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు . మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలకు వెళ్ళే రహదారి అధ్వానంగా తయారైందని నూతన రోడ్డు నిర్మించాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యేను కోరడంతో అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను చర్చి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, క్రైస్తవ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

## చెత్త పై నిర్లక్ష్యం వద్దు... చెత్తే మన సంపద

- వ్యాపారులపై వేసిన పెనాల్టీ సొమ్ముతో ట్రబ్బులు కొని ప్రజలకు అందజేత - కూరగాయల మార్కెట్లో మటన్ దుకాణాలు మార్చండి - తడి పొడి చెత్త ద్వారా తయారుచేసిన ఎరువును కేజీ ..10 కే అమ్ముతున్నాం. - స్వచ్ఛ్ ఆంధ్ర ప్రోగ్రాంలో... జిల్లా పంచాయతీరాజ్ అధికారిణి సమత





సమావేశంలో మాట్లాడుతున్న డిపిఓ

**గోరంట్ల, డిసెంబర్ 20 ప్రభాతవార్త**

ఎక్కడ పడితే అక్కడ చెత్త పారవేయరాదని, పంచాయతీ వాహనాల్లో వేయాలని, చెత్తతో ఎరువులు తయారు చేస్తున్నామని, తద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతోందని జిల్లా పంచాయతీ అధికారిణి సమత స్పష్టీకరించారు. పట్టణంలోని రావికుంట చెరువులో ఉన్న చెత్తతో ఎరువుల తయారీ కేంద్రంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా డిపిఒ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిపిఒ సమత మట్లాడుతూ.. రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం ప్రవేశపెట్టిందని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా.. పంచాయతీ వాహనాల్లోకి అందిస్తే రెండు ఉపయోగాలు ఉన్నాయని వెల్లడించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడే వేయకపో వడంతో మీ ప్రాంతం పరిశుభ్రంగా ఉంటుందని, అదే విధంగా చెత్తతో వానపాము లఅభివృద్ధి వర్మికంపోస్టుతో నాణ్యమైన ఎరువు తయారు చేసి రైతులకు కిలో రూ.10మేర అమ్ముతున్నామని పేర్కొన్నారు. ఇలా వచ్చిన ఆదాయంతో మీ ప్రాంతంలోనే వివిధ అభివృద్ధి పనులు చేపడుతామని విశ్లేషించారు. ఇలా ఒక నిర్ణయంతో రెండు ఉపయోగాలు ఉన్నాయని వివరించారు. అదే విధంగా పాత చీరలు, ఇతర బట్టలు పారవేయకుండా బ్యాగులు తయారు చేసుకోవచ్చిని వెల్లడించారు. తయారు చేసిన బ్యాగులను నాణ్యతను బట్టి రూ.4నుంచి8ల వరకు పంచాయతీ కొనుగోలు చేస్తుందని వివరించారు. దీనిపై మహిళా సంఘాలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఆదివారంతో పాటు ఇతర సెలవు దినాల్లో విద్యార్థులు సైతం వీటిని తయారు చేసుకునే విధంగా తర్ఫీదు ఇప్పిస్తామని, దీంతో ఆదాయంతో పాటు కళ్లకు ఎంతో హాని కలిగించే సెల్ఫోన్ వాడకం తగ్గిపోతుందని చెప్పారు. శిక్షణ ఇవ్వడానికి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సిద్ధంగా ఉందని చెప్పారు. ఇదే ప్రాంతంలో శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయిస్తున్నామని, ఇందులో మహిళలు, పిల్లలు, విద్యార్థులు శిక్షణ తీసుకుని ఆదాయం పొందవచ్చని వివరించారు. అనంతరం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి చైతన్య కుమార్ రాజు శిక్షణ గురించి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భర్త నాగేనాయక్, నాయకులు నిమ్మల శ్రీధర్, సోమశేఖర్, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మినారాయణ, నాయకలు అజ్మతుల్లా, నరేష్ తో పాటు పలువురు పాల్గొన్నారు. చికెన్, మటన్ కేంద్రాలు వెంటనే తొలగించండి పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ చికెన్, మటన్ కేంద్రాలు ఉన్నాయని, ఇక్కడికి కుక్కలు గుంపులుగా చేరి ప్రజలపై దాడి చేసి కరుస్తున్నాయని, వీటిని వెంటనే తొలగించి ఇతర ప్రాంతాలకు తరలించాలనిఎపీ, ఎస్సీ మానటరింగ్ కమిటి సభ్యులు దేవరకొండ ఉమాశంకర్ డిపిఓ దృష్టికి తెచ్చారు. పట్టణం అభివృద్ధి చెందుతున్న తరుణంలో మటన్ కేంద్రాలు ఎక్కడపడితే అక్కడ ఉంటంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తొలుత స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం వీరి నుంచే ప్రారంభించాలని సూచించారు. దీనిపై స్పందించిన డిపిఒ సమత మాట్లాడుతూ.. ఎరువుల తయారీ కేంద్రానికి ఎదురుగా ఉన్న మటన్ కేంద్రాలను వారంలోగా తొలగిస్తామని, వీటిని తొలగించాలని ఇప్పటికే కలెక్టర్ ఆదేశించారని వివరించారు. వీరందరికీ నోటీసులు ఇచ్చామని, ఖాళీ చేయడానికి రెండవ దఫా నోటీసులు జారీ చేస్తామని, వారు స్పందించకపోతే తాము ఖాళీ చేయిస్తామని తహశీల్దార్ మారుతి, ఎంపిడిఒ కమలాబాయి, కార్యదర్శి సాయి సంజయ్ స్పష్టం చేశారు.




## గ్రంథాలయంలో చిన్నయ సూరి జయంతి ఉత్సవాలు

లేపాక్షి, డిసెంబర్ 20 ప్రభాతవార్త



చిన్నయ సూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

లేపాక్షి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి మల్లికార్జున ఆధ్వర్యంలో చిన్నయసూరి జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నయ్య సూరి సాహిత్యానికి చేసిన సేవలను కొనియాడారు. చిన్నయ సూరి వాడుక భాషలో గ్రంథ రచన చేసిన మొదటి కవిగా బాల వ్యాకరణ కర్తగా తెలుగు ప్రజలకు విశేష సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి కార్తీక మహోత్సవానికి హాజరైన కన్వీనర్

బ్రహ్మసముద్రం డిసెంబర్ 20 ప్రభాతవార్త



ఆంజనేయ స్వామిని దర్శించుకుంటున్న దృశ్యం

బ్రహ్మ సముద్రం మండల పరిధిలోని బైరనసముద్రం గ్రామము నందు శ్రీ ఆంజనేయ స్వామి వారి కార్తీకం మహోత్సవం సందర్భంగా బ్రహ్మానసముద్రం మండలం బైర సమ్మున్ద్ర గ్రామస్తుల ఆహ్వానం మేరకు బ్రహ్మానసముద్రం మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు బైరసముద్రం గ్రామంలో జాతర కువిచ్చేసి శ్రీ ఆంజనేయస్వామి స్వామివారి రథోత్సవంలో పాల్గొనీ స్వామివారికి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలుస్వీకరించారు.అనంతరం కన్వీనర్ పాల బండ్ల శ్రీరాములు గ్రామస్తులు పూలమాలవేసి శాలువతో సత్కరించారు ఈ కార్యక్రమంలో లింగ న్నలక్ష్మన్న, చిన్న పాతన్న, ఓబయ్య, సిద్దయ్య, నాగరాజు, ప్రభాకర్, నాగరాజు, ఆంజనేయ, పాలన్న, ఎర్రి స్వామి పూజారి చంద్ర, గ్రామస్తులు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శవం ముందరేసి దళితుల ధర్నా

-కొర్లకుంట ఎస్సి కాలనీవాసులు ఆక్రందన

-పట్టు విడవకపోవడంతో సంఘటనాస్థలానికి ఆర్డీఒ, డిఎస్పి రాక



తహశీల్దార్ కార్యాలయం ఎదుట శవంతో బైటాయించి ఆందోళన చేస్తున్న ఎస్సి కాలనీవాసులు

చిలమత్తూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త

మండలంలోని దేమకేతేపల్లి పంచాయతీ కొర్లకుంట గ్రామంలోని దళితవాడలో నివసిస్తున్న అంజనమ్మ మృతి చెందింది. ఈ కాలనీవాసులు ఎవరైన మృతి చెందిందే అంతిమసంస్కారాలు చేసుకునే స్మశానవాటికకు వెళ్లే దారిలో పట్టాభూమి వెంబడి వెళ్లి కార్యక్రమాలు చేసుకోవాలి. గత కొన్ని సంవత్సరాలుగా దళితుల స్మశానవాటికకు దారి చూపండి శాశ్వత మార్గానికి రెవెన్యూ రికార్డుల్లో స్కెచ్ నమూనాను బైపరిగేషన్ చేసి శాశ్వత పరిష్కారం చూపాలని గత కొన్ని సంవత్సరాలుగా అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగకపోవడంతో దళితకాలనీవాసులు శనివారం కన్నెర్ర చేశారు. తమ బస్తీలో అనారోగ్యంతో మృతి చెందిన అంజనమ్మ మృతదేహాన్ని నేరుగా చిలమత్తూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట వుంచి అధికారులను లోపలికి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. స్థానికులు, కొంతమంది అధికారులు చెప్పి చూసినా పట్టువీడకపోవడంతో విషయం కాస్త ఆర్డీఒ దృష్టికి వెళ్లడంతో హుటాహుటిన హిందూపురం డిఎస్పి మహేష్, ఆర్డీఒ ఆనంద్‌కుమార్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. రూరల్ సిఐ జనార్ధన్, స్థానిక ఎస్ఐ మునీర్‌అహమ్మద్‌లు దళితవాసుల డిమాండ్లను తెలుసుకుని సర్దిచెప్పే ప్రయత్నం చేసినా తక్షణమే పరిష్కారమార్గం చూపకపోతే శవంతో తాము కదిలేదిలేదని భీష్మించి కూర్చోవడం అది కాస్తా ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లడం జరిగింది. చివరికి ఆర్డీఒ, డిఎస్పిలు ఓ జెసిబిని ఆ స్మశానవాటికకు వెళ్లే పట్టాభూమి వద్దకు వెళ్లి దారి చూపేలా జెసిబితో పనులు చేయించడంతో ఆ కాలనీవాసులు తమ ఆందోళన విరమించారు. ఏదిఏమైనా పట్టాభూమిలో ఎవరేగాని ప్రవేశచర్యలు చేయకూడదని ఓ వైపు కోర్టు ద్వారా ఇంజక్షన్ ఆర్డర్ తీసుకరావడం దారి సమస్య పరిష్కారం కాక కాలనీవాసులు కన్నెర్ర చేయడం పరిపాటిగా మారుతూ మానవహక్కులసాధన విషయంలో ప్రభుత్వ యంత్రాంగంలో పనిచేసే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకే ప్రాణాలతో ఫిర్యాదులు చేయాల్సిన ప్రజలు చివరికి మృతి చెందిన శవాలను కార్యాలయం వద్దకు తీసుకురావాల్సిన పరిస్థితి అధికారుల ఉదాసీనతకు అద్దం పడుతోంది.

## బాల్య వివాహ ముక్త్ భారత్‌లో భాగం అవుదాం

-జూనియర్ కాలేజీలో అవగాహన చేపట్టిన ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగరాణి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

గోరంట్ల, డిసెంబర్ 20 ప్రభాతవార్త

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గోరంట్ల పట్టణంలోని ఎస్‌పిఎస్ కళాశాలలో శనివారం బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ డాక్టర్ శాంతలక్ష్మి ఆదేశాల మేరకు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో బాల్యవివాహ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి శనివారం నిర్వహించే "నో బ్యాక్ డే" కార్యక్రమంలో భాగంగా కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాగరాణి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికల్లో కలిగే అనారోగ్య సమస్యలు, విద్యకు ఏర్పడే అడ్డంకులు, చట్టపరమైన శిక్షలు వంటి అంశాలపై విద్యార్థులకు వివరంగా అవగాహన కల్పించారు. విద్యార్థులందరూ బాగా చదువుకోవాలని బాల్యవివాహాలను తిరస్కరించాలని, బాల్య వివాహాల వలన కలిగే అనర్థాల గురించి, తల్లిదండ్రులకు, గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రమేష్, రామాంజనేయులు, నరసింహప్ప, కళావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

## ఉపాధి హామీ పథకం లో మహాత్మా గాంధీ పేరు తొలగించడం దుర్మార్గమైన చర్య

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్ మండిపాటు




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్

కళ్యాణదుర్గం రూరల్ డిసెంబర్ 20 ప్రభాతవార్త

జాతిపిత మహాత్మా గాంధీ స్వాతంత్ర ఉద్యమంలో ప్రముఖమైన వ్యక్తిగా నిలిచారని ఆయన జ్ఞాపకార్థం గతంలో కేంద్ర ప్రభుత్వం నామకరణం చేసిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరులో ప్రస్తుత మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరు తొలగించి దుర్మార్గమైన చర్యకు పూనుకోవడం దారుణమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్ మండిపడ్డారు ఆయన నియోజకవర్గ కేంద్రం కళ్యాణదుర్గంలో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పేదలకు ఉద్దేశించి కరువు కాటకాలకు నిలయమైన అనంతపురం జిల్లాలో ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభించారని ఆనాటి నుంచి నేటి వరకు పేదలకు వలస కూలీల రక్షణగా నిలబడిన ఈ పథకం నేడు అడ్డదిడ్డమైన చర్యలతో మోది వికృత శ్రేష్టలతో పేదలకు అందకుండా దూరమవుతుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పేరుమార్పుతో మభ్యపెట్టడం మోదీ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గమైన చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు ఇంతటి దారుణమైన చర్యకు ఒడిగడుతున్న మోడీ ప్రభుత్వం పై కూటమి పార్టీ భాగస్వామ్యాలైన చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ అడ్డుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పేదలకు పట్టెడన్నం పెడుతున్న ఈ పథకాన్ని కనుమరుగు చేయడంలో కుట్రలో భాగంగా కనిపిస్తోందన్నారు గత ప్రభుత్వ హయాంలో కూడా జగన్ కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ పూరిత చర్యలను అడ్డుకోకపోవడంతోనే కొనసాగుతున్నాయన్నారు ఈనెల 22వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని దీనికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని ఆయన ప్రకటన విడుదల చేశారు రైతులు పండించిన వ్యవసాయ దిగుబడులకు మద్దతు ధర కల్పించాలని లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు ప్రస్తుతం అరటి రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని కనీసం పెట్టుబడులు కూడా రావడం లేదని చరిత్రలో మొదటిసారిగా అరటి పంటలను తొలగించడం చూస్తున్నామని ఇంతటి దారుణ పరిస్థితి నెలకొవడం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనం అని తీవ్రంగా ఖండించారు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటన విడుదల చేశారు గాని ప్రస్తుతం రెండు సంవత్సరాలు గడిచిపోతున్నాయని ఎనిమిది లక్షల ఉద్యోగాలు ఎక్కడికి వెళ్లాయని వారు సూటిగా ప్రశ్నించారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నారాయణస్వామి కార్యదర్శి గోపాల్ సహాయ కార్యదర్శి నరసింహులు నాగరాజు నాయక్ తిమ్మ రాయుడు బుడెన్ సాబ్ సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు 52 మంది విద్యార్థులు ఎంపిక

సంచలనం సృష్టించిన నూతిమడుగు జడ్పీ పాఠశాల విద్యార్థులు

కంబదూరు, డిసెంబర్ 20, ప్రభాతవార్త

కంబదూరు మండలం నూతిమడుగు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 52 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల సిబ్బంది శనివారం మీడియాకు తెలిపారు . పీఈటీ సంజీవరాయుడు శిక్షణలో విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రస్థాయిలోను రాణించ పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు పాఠశాల పీడీలు సంజీవరాయుడు, దాదావలిను ఉపాధ్యాయ బృందం సత్యనారాయణ, నరేష్ బాబు, శివకుమార్, వెంకట్ రెడ్డి, వెంకటరమణ, లక్ష్మీనారాయణ, కృష్ణ ప్రసాద్, శివప్ప, ప్రతాప్, మహేష్,బ్రహ్మానంద్ద, శివయ్య, తిప్పేస్వామి, లోక్నాథ్, బాలముని, మల్లిక, నళిని, గోవర్ధన్ గోహార్ జవహర్, శ్రీనివాసులు, గ్రామ ప్రజలు, పాఠశాల చైర్మన్ పరమేశ్వర్, వైస్ చైర్మన్ ప్రసాద్ అభినందనలు తెలిపారు.

## నిధులపై శిక్షణా తరగతులు

కనేకల్ డిసెంబర్ 20 ప్రభాతవార్త



శిక్షణ ఇస్తున్న అధికారులు

కణేకల్ మండల పరిషత్ కార్యాలయం లో ఓ యస్సార్ స్వంత నిధులు సేకరణ మరియు సర్వే పై ట్రైనింగ్ పంచాయతీ అభి వృద్ధి అధికారులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లకు, డిజిటల్ అసిస్టెంట్ లకు, సర్వేయర్ లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం శనివారం ఎంపీడీవో విజయసింహ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విజయ్ సింహ మాట్లాడుతూ స్వామిత్వ ప్రధాన లక్ష్యాలు గ్రామాల్లోని నివాస స్థలాలకు స్పష్టమైన యాజమాన్య హక్కులను స్థాపించడం. ఆస్తిని ఆర్థిక ఆస్తిగా ఉపయోగించుకునేలా చేయడం (బ్యాంకు రుణాలు, ఆర్థిక సౌకర్యాలు). ఆస్తి సంబంధిత వివాదాలను తగ్గించడం. గ్రామ పంచాయతీలకు పన్నుల నిర్ధారణలో సహాయం చేయడం. అని అన్నారు. ..గ్రామ స్థాయిలో మెరుగైన ప్రణాళికకు అవసరమైన జిఐఎస్ మ్యాప్‌లను సృష్టించడం అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమం లో ఎంపిడిఒ వి విజయ సింహా రెడ్డి తహశీల్దార్ బ్రహ్మయ్య డిప్యూటీ ఎంపీడీవో చంద్రమోళి షేక్షా వలి పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమం అమలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి

పోలియో చుక్కలకు 38,199 చిన్నారులు లక్ష్యం

ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజేష్ కుమార్

కళ్యాణదుర్గం డిసెంబర్ 20 ప్రభాతవార్త



ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజేష్ కుమార్

పల్స్ పోలియో కార్యక్రమం ఈనెల 21వ తేదీ నిర్వహణ కోసం కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమంలో 05 చిన్నారులకు పోలియో నివారణ చుక్కలు వేయబడునని, మీ ఇంట్లో ఉన్న చిన్నారిని తప్పకుండా పోలియో బూత్ దగ్గరకు ఉదయం 7 గంటలకే తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించి పిల్లల భవిష్యత్తును సురక్షితంగా చేయాలని, పోలియో రహిత భారత్ మనందరి బాధ్యతని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజేష్ కుమార్ తెలియజేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా ముద్దినాయన పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 6284, కుందుర్పి మండల పరిధిలో 7945, కంబదూరు మండల పరిధిలో 6075, సెట్టూరు మండల పరిధిలో 5270, బ్రహ్మసముద్రం మండల పరిధిలో 6003, కళ్యాణదుర్గం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో 3282, ఒంటిమిద్ది అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో 3340 మొత్తం 38,199 మంది ఐదేళ్ల లోపు చిన్నారులను లక్ష్యంగా పెట్టుకొని పోలియో చుక్కలు వేయడానికి వైద్య సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, వాలంటీర్లుతో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆయన తెలిపారు.

## విద్యార్థులు శుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ డి,ఇ రమేష్ కుమార్

హిందూపురం టౌన్ డిసెంబర్ 20 ప్రభాతవార్త

ప్రతి ఒక్క విద్యార్థి స్వీయ శుభ్రత పాటించాలని హిందూపురం మున్సిపల్ చైర్మన్ డి,ఇ రమేష్ కుమార్ అన్నారు. శనివారం ముస్తాబు కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి గంగప్ప ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఎమ్మెల్యే పిఎ వీరయ్యలతో కలిసి హిందూపురం పట్టణంలోని దుర్గాబాయి దేశ్ముఖ మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో ముస్తాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు శుభ్రత పాటిస్తూ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. చిన్నప్పటినుండి శుభ్రత పాటించడం వలన పెద్దయ్యాక మంచి లక్షణాలు మీలో ఏర్పడతాయని విద్యార్థులకు తెలిపారు. ప్రతి పాఠశాలలో ముస్తాబు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని దీనిని విద్యార్థులు వినియోగించుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం సూర్యనారాయణ, ఐఆర్పిలు లలిత,నందిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన అవసరం

డి.హిరెహాళ్ డిసెంబరు 20 ప్రభాతవార్త



ఆన్లైన్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

విద్యార్థి దశ నుండే విద్యార్థులు విద్యతోపాటు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమని జిల్లా వినియోగదారుల సంఘాల సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం డి.హిరెహాళ్ మండలం సోమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు అనూరాధ అధ్యక్షతన వినియోగదారుల రక్షణ చట్టంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో ఆన్లైన్‌మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని ఈవిషయాలను విద్యార్థులు తమ తల్లిదండ్రులకు వివరించి మోసాల నివారణకు వారిని చైతన్య పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. అనివార్య పరిస్థితుల్లో మోసాలు జరిగితే ఈ జాగృతి పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం వినియోగదారుల సంఘంఅధ్యక్షులు జి.సత్యనారాయణ, ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్నుపల్లి అన్నదాతల ఆక్రంధన

- అన్నుపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ముందు గ్రామ ప్రజలు రైతులు ఆందోళన..
- విద్యుత్ సరఫరా అంతరాయంతో ఎండిపోతున్నపంటలు
- లబోదిబోమంటున్న అన్నదాతలు
- విద్యుత్ అధికారులకు పలుమార్లు పిర్యాదు చేసిన నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆగ్రహం...

శెట్టూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త

మండల పరిధిలో ని అనుంపల్లి గ్రామంలో శనివారం గ్రామానికి చెందిన రైతులు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని సబ్ స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు .విద్యుత్ సిబ్బంది విధులకు సకాలంలో హాజరుకాకుండా తమకు విద్యుత్ సరఫరా ఎప్పుడొస్తుందో ఎప్పుడు పోతుందో దిక్కు తోచని పరిస్థితి నెలకొందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్న సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆందోళన చేపట్టారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి సకాలంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. అంతే కాకుండా ప్రస్తుతం కుందుర్పి మండలానికి చెందిన బసాపురం మాయదార్లపల్లి రైతుల పంట పొలాల సర్వీసులు అన్నుపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ కు విలీనంచేయటంతో కెపాసిటీ అధికమై తరచూ విద్యుత్ తీగలు తెగిపడు తుంటాయని సంబంధిత అధికారులకు తెలిపిన నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు విమర్శించారు.చివరకు రైతుల పంటలు ఎండిపోవడంతో స్థానిక సబ్ స్టేషన్ ముందు బైఠాయించారు. సిబ్బందికి వ్యతిరేకంగా పలు నినాదాలు చేశారు. రైతులు ఏఈ బాల చంద్రుడుకు చరవాణి ద్వారావిషయం తెలుపగా వెంటనే చొరవచూపి రైతుల పంటలు ఎండిపోకుండా విద్యుత్ సరఫరా అందించటానికితీర్మానించారు. అందుకు రైతులందరు సుముఖత చూపారు అంతటితో నిరసన కార్యక్రమాన్ని విరమించారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ సురేంద్ర బాబు, మాజీ ఎంపీటీసీ క్రిష్టప్ప, దురదకుంట నాగరాజు,దొనయ్య,తిప్పేస్వామి, వన్నురప్ప,గొల్ల శివన్న,శివారెడ్డి,రైతులు, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

## ఈనెల 23న కొత్త చెరువులో మెగా జాబ్ మేళా,..

కొత్తచెరువు డిసెంబరు 20 ప్రభాతవార్త.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొత్తచెరువు మండల కేంద్రంలోని శ్రీ శివ సాయి జూనియర్ కళాశాల నందు డిసెంబర్ 23వ తేదీన ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని శివ సాయి విద్యాసంస్థల చైర్మన్ గడపర్తి ఆదిశేషప్ప ఓ ప్రకటనలో తెలిపారు ఈ జాబ్ మేళాలో బహుళ జాతీయ 20 కంపెనీలు పైగా హాజరుకానున్నాయి. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ జాబ్ మేళాలో వివిధ కంపెనీలు పాల్గొన్నారు జాబ్ మేళా కు హాజరయ్యే అభ్యర్థులు వయసు 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలు లోపు ఉండాలి. వారి విద్య అర్హతను బట్టి ఇంటర్వ్యూలు నిర్వహించి సెలెక్ట్ చేయబడును, సెలెక్ట్ అయిన అభ్యర్థులకు నెలకు 10 వేలు రూపాయలు నుంచి 25 వేల రూపాయలు జీతం ఉంటాధని తెలిపారు ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు వారి విద్య అర్హతకి సంబంధించిన పత్రాలు జిరాక్స్ తీసుకొని రావాలని సూచించారు మరిన్ని వివరాలకు 99 66 8 22 46 నెంబర్ కి సంప్రదించాలని తెలియజేశారు.

## చౌక దుకాణాల తూనికల యంత్రాలను పరిశీలించిన అధికారులు

గుడిబండ డిసెంబర్ 20 ప్రభాతవార్త



తూనికల యంత్రాలను పరిశీలిస్తున్న దృశ్యం

మండల వ్యాప్తంగా ఉన్న చౌకధాన్యపు దుకాణాల తూనికల యంత్రాలను ను తూనికలు , కొలతల శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా తూనికలు కొలతల శాఖ అధికారులు మండల తహశీల్దార్ కార్యాలయంలో అన్ని చౌక దుకాణాల తూనికలను పరిశీలించారు.ఈ సందర్భంగా మెట్రాలజీ అధికారి మారుతి ప్రసాద్ మాట్లాడుతూ ఇన్స్పెక్టర్ శివశంకర్ ఆధ్వర్యంలో డీలర్ల వద్ద ఉన్న తూనికలను పరిశీలించామని తెలిపారు.అలాగే ప్రజలకు చౌక ధాన్యపు దుకాణాల అందించే నిత్యావసర సరుకుల బరువులో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పకడ్బందీగా పంపిణీ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్,సిఎస్డిటి నవీన్, తూనికలు కొలతల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి తీర్థం పుచ్చుకున్న వైకాపా నాయకులు

గుమ్మఘట్ట డిసెంబర్ 20 ప్రభాతవార్త



కండువా కప్పి టిడిపి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాలవ

గుమ్మఘట్ట మండలం మారం పల్లి గ్రామానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు, నాయకులు శని వారం తెలుగుదేశం పార్టీలో చేరారు. రాయదుర్గంలోని ఎమ్మెల్యే స్వగృహంలో గుమ్మగట్ట టిడిపి సీనియర్ నాయకులు ఉస్మాన్ సాబ్, రామాంజనేయులు, మండల కన్వీనర్ సన్నన్న ఆధ్వర్యంలో 18 కుటుంబాలకు చెందిన వారు టిడిపిలోకి చేరారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కండువా కప్పి వారిని తమ పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ ఆశయాలకు అనుగుణంగా కష్టపడి పని చేయాలని, వారికి మంచి గుర్తింపు ఉంటుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కాలువ సన్నన్న , సీనియర్ నాయకులు హుస్సేన్, నాయకులు కార్యకర్తలు అభిమానులు

## హిందూ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

-మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌గుప్తా

గుత్తి, డిసెంబర్ 20 ప్రభాతవార్త



మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌గుప్తా మాట్లాడుతున్న దృశ్యం

గుత్తి పట్టణంలో ఆదివారం చారిత్రాత్మకంగా నిర్వహించనున్న హిందూ సమ్మేళనాన్ని ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని, మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌గుప్తా పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిందువుల ఐక్యతకు నిదర్శనంగా ఈ కార్యక్రమంలో భాగంగాబహిరంగర్యాలీ నిర్వహించనున్నామన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా, ప్రతి ఒక్క హిందువు ఫుట్బాల్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభకు హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, నారాయణగుప్తా, గోపాల్, వెంకప్ప, వెంకటేశ్వర్‌రెడ్డి, రమణ, సుధాకర్, మహేష్‌రెడ్డి, నాగయ్య, కృష్ణయ్య, సతీష్, శ్రీనివాసులు, రామకృష్ణ, వేదమూర్తి, విద్యాధర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర




స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ చేపడుతున్న దృశ్యం

కళ్యాణదుర్గం టౌన్, డిసెంబర్ 20 , ప్రభాత వార్త

కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ హర్ష లత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది విద్యార్థులతో కలిసి ప్రత్యేక ర్యాలీ చేపట్టారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీధర్, కళాశాల అధ్యాపకులు కేశవరావు, శ్యాంప్రసాద్ ,షోకత్ అలీ , రాధాకృష్ణ ,గోపి ,గణేష్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సత్యమ్మ దేవాలయం అభివృద్ధికి రూ.50 వేలు విరాళం

లేపాక్షి, డిసెంబర్ 20 ప్రభాతవార్త



సత్యమ్మ ఆలయ పునర్నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

మండలంలోని మామిడిమాకులపల్లిలో వెలసిన గ్రామదేవత శ్రీసత్యమ్మదేవి ఆలయ పునర్నిర్మాణానికి లక్ష్మీ వెంకటేశ్వర మైన్స్ అండ్ స్టోన్స్ క్రషర్ మేనేజింగ్ పార్ట్నర్ సుధీర్‌రెడ్డి 50 వేల రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణంలో తాము మరింత సహాయ సహకారాలు అందజేస్తామని ఆయన వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర స్థాయి పోటీలకు కేటీయస్ విద్యార్థి ఎంపిక

రాయదుర్గం రూరల్ డిసెంబర్ 20 ప్రభాతవార్త



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థితో కళాశాల బృందం

రాయదుర్గం స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి ఎస్ ఎం డి. అలీ ప్రథమ సం బీకాం అంతర్రాష్ట్రీయ బాస్కెట్బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ అబ్బాయి చెన్నైలోని ఎస్. ఆర్. ఎం.ఐ విశ్వవిద్యాలయంలో ఈనెల 24 నుండి 25వ తేదీ వరకు జరుగు ఇంటర్ యూనివర్సిటీ సౌత్ జోన్ బాస్కెట్బాల్ పోటీల్లో ఎస్కె యూనివర్సిటీ తరఫున పాల్గొంటారని తెలిపారు.కళాశాల విద్యార్థి ఈ విధంగా ఇంటర్ యూనివర్సిటీ సౌత్ జోన్ బాస్కెట్బాల్ పోటీలకి ఎంపికైన సందర్భంగా అధ్యాపకులు విద్యార్థికి అభినందనలు తెలియజేశారు.

## తగరకుంట మాజీ సర్పంచ్ గణపతి గుండెపోటుతో మృతి

నివాళులు అర్పించిన తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి

కనగానపల్లి డిసెంబర్ 20 ప్రభాతవార్త



మృతదేహానికి నివాళులర్పిస్తున్న తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి.

మండలంలో తగరకుంట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గణపతి నిన్నటి రోజు శుక్రవారం రాత్రి గుండె పోటు తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాప్తాడు నియోజకవర్గ వై.యస్.ఆర్.సిపి సీనియర్ నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి గ్రామంలోని మృతుని స్వగృహానికి చేరుకుని గణపతి భౌతిక దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గంగుల సుధీర్ రెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ఎంపీ అంబికా లక్ష్మినారాయణకి మోనం నా మతం కాదు పుస్తక సమర్పణ

అనంతపురం కల్చరల్, డిసెంబర్ 20 ప్రభాతవార్త



ఎంపి అంబికా లక్ష్మినారాయణకు పుస్తకాన్ని అందజేస్తున్న దృశ్యం

ఇటీవల అనంతపురం జిల్లా డ్వామా సమావేశ మందిరంలో అత్యంత వైభవంగా ఆవిష్కరించబడిన మోనం నా మతం కాదు పుస్తకాన్ని, ఆ గ్రంథ రచయిత ఖట్టేవాలే దాదాఖలందర్, అస్త్రం కాకర్ల నాగేంద్ర శనివారం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మినారాయణని మర్యాదపూర్వకంగా కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ పుస్తకాన్ని పరిశీలించి, రచయితను ప్రత్యేకంగా అభినందించారు. గత వారం జరిగిన పుస్తకావిష్కరణ సభలో సభాధ్యక్షులు రాయపాటి శివయ్య, తలవంచని అరణ్యం కవి అన్వర్, పుస్తక సమీక్షకులు షమీవుల్లా, నాగేశ్వరాచారి, సూర గౌని రామకృష్ణ, ఆవిష్కర్త ఖట్టేవాలే మహమ్మద్ షరీఫ్, పాల్గొని రచయిత ప్రతిభను కొనియాడారు. అలాగే వేలూరు జయచంద్ర, నాగేశ్వరాచారి, కాకర్ల నాగేంద్ర, పలువురు ప్రముఖులు ఈ పుస్తక విశిష్టతను చాటిచెప్పారు. తన తొలి ప్రయత్నాన్ని ఆదరిస్తున్న సాహితీ లోకానికి, ప్రోత్సహిస్తున్న పెద్దలకు రచయిత ఖట్టేవాలే దాదాఖలందర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షా చాలా ముఖ్యం

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 20 ప్రభాతవార్త



రక్త నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి ఆదేశాలమేరకు ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్ర, శనివారం విద్యార్థులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్ .ఎ.వి. ప్రసాద్ మాట్లాడుతూ.. రోగికి రక్త మార్పిడి విషయంలో రక్తం యొ క్క ఖచ్చితమైన గ్రూపు చాలా ముఖ్యం. రోగి స్వీకరించే రక్తం యొక్క రక్త వర్గానికి సరిపోని రక్త వర్గాన్ని కలిగి ఉన్న రోగికి రక్తాన్ని అందించి నట్లయితే, అది రోగి యొక్క రక్తంలో ఇంట్రావీనస్ క్లంపింగ్‌కు కారణమవు తుందని ఇది ప్రాణాంతకం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో శ్రీనాథ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు మోహన్ కృష్ణ,జీవన్, ఎన్ఎస్ఎస్ అధికారులు జి.ఆనంద్ బాబు, టి.సుదర్శన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు హరిత, మైత్రి, వైష్ణవి, కీర్తన, స్పందన, కృష్ణవేణి, అరుణజ్యోతి పాల్గొన్నారు.

## బాయ్స్ హై స్కూల్‌లో ఎస్సై రైటింగ్

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 20 ప్రభాతవార్త



ఎస్సై రైటింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

స్థానిక ప్రభుత్వ బాయ్స్ హై స్కూల్‌లో శనివారం నేషనల్ కన్జ్యూమర్ డే సందర్భంగా జిల్లాస్థాయి ఎస్సే రైటింగ్, ఎలక్యూషన్ తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో పోటీలు నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న అనంతపురం జిల్లా ఉప విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు. సమగ్ర శిక్ష అనంతపురం ఏయంఒ వేణుగోపాల్ సీఎంఒ చంద్రశేఖర్ ఈ పోటీలకు జ్యూరీగా విచ్చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్లు వెంకట్ నారాయణ, అచ్యుతానంద జిల్లా పరిషత్ హై స్కూల్ హెడ్మాస్టర్లు చంద్రశేఖర్, సాంబశివుడు, మల్లికార్జున ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ రవీంద్ర నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురం స్థానిక ఆదిమూర్తి నగర్ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థి ప్రతిభ

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 20 ప్రభాతవార్త



ప్రతిభ చాటిన విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

ఆదిమూర్తి నగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థి ఎక్కలూరు అమీనా తాజ్ రెండవ తరగతి చదు వుతున్న విద్యార్థి స్కేటింగ్ ఇంటర్నే షనల్ లెవెల్ కాంపిటీషన్లో తన ప్రతిభను కనబరిచి రెండు గోల్డ్ మెడల్స్ ఒక సిల్వర్ మెడల్ తన సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా చైతన్య పాఠశాల ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. చదువుతోపాటు పిల్లలకు ఇలాంటి పోటీల్లో పాల్గొనడం కూడా చాలా అవసరం అని తెలియజేస్తూ మెడల్స్, సర్టిఫికెట్‌తో అమీనా తాజ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కే.శాంత అనంతపూర్ ప్రైమరీ జోనల్ కోఆర్డినేటర్ పూజ ప్రైమరీ ఇంచార్జ్ దీప ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ బత్తుల్ పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబునాయుడును కలిసిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, డిసెంబర్ 20 ప్రభాతవార్త



సీఎం చంద్రబాబునాయుడుతో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

కేంద్ర మంత్రులతో సమావేశాల కోసం ఢిల్లీలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుని శనివారం శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మర్యాద పూర్వకంగా కలిశారు.

## నేడు 5 సంవత్సరాలలోపు పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు - తరిమెల పిహెచ్‌సి డాక్టర్ శంకర్‌నాయక్

శింగనమల, డిసెంబర్ 20 ప్రభాతవార్త



మాట్లాడుతున్న డా.శంకర్‌నాయక్

నేడు అప్పుడే పుట్టిన బిడ్డ మొదలు ఐదు సంవత్సరాల పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తరిమెల పిహెచ్‌సి డాక్టర్ శంకర్‌నాయక్ తెలిపారు. మండల వ్యాప్తంగా 43 బూతులు ఏర్పాటు చేసినట్లు శింగనమల మండల కేంద్రంలో ఆర్టిసి బస్టాండ్ వద్ద ఒక ట్రాన్సిట్ పాయింట్ ఏర్పాటు చేసినట్లు, మండలంలో గుర్తించిన హై రిస్క్ ప్రాంతాల్లో పిల్లలకు పోలియో చుక్కలు వేయడానికి మొబైల్ టీం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 22, 23 తేదీల్లో ఇంటింటికీ పోలియో కార్యక్రమం నిర్వహించి బూతులలో చుక్కలు వేసుకోని చిన్నారులకు ఇంటి దగ్గర పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా 100 శాతం పోలియో చుక్కలు వేయడానికి కృషి చేస్తామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి ఆర్థిక సాయం

అనంతపురం కల్చరల్, డిసెంబర్ 20 ప్రభాతవార్త



ఆర్థిక సాయం చేస్తున్న టిడిపి నేత రామలింగారెడ్డి

రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త బండారు ఆదినారాయణ మరణిం చారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాటప్పశ్రీ గారి రామలింగారెడ్డి శింగనమల నియోజ కవర్గం బుక్కరాయస ముద్రం మండలం స్వాగ్రా మం సిద్దారం పురంకు చేరుకుని ప్రమాద వివరాలను తెలు సుకుని, ఆదినారా యణ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనం తరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి వ్యక్త పరిచారు. అనంతరం మృతుడి దహన సంస్కరణ ఖర్చులకి రూ.10000/ ఆర్థిక సాయం చేశారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైతం నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

## జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కువైట్‌లో రక్తదాన శిభిరం

### - వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్ఆర్ఐ విభాగం కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి



మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి



హాజరైన వైఎస్ఆర్‌సిపి ఎన్ఆర్ఐలు

శింగనమల, డిసెంబర్ 20 ప్రభాతవార్త

వైఎస్ఆర్‌సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి పుట్టిన రోజు సందర్భంగా కువైట్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్ఆర్ఐ విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు ను కేవలం కేక్ కట్ చేసి జరుపుకోవడం కాదు, సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవాలన్నదే మా భావన. ఈ రక్తదాన శిబిరంలో 67 మంది స్వచ్ఛ ందంగా రక్తదానం చేసి కువైట్ సెంట్రల్ బ్లడ్ బ్యాంకుకు అందజేసినట్లు తెలిపారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంతకంతో కూడిన ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. ఈ పుట్టిన రోజు వేడుక ఇక్కడితో ముగియదు, సత్యం సేవా ప్రజల పక్షాన నిలబడే పోరాటం కొనసాగుతు ందన్నారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ కన్వీనర్ బిహెచ్ ఏలియాజ్, కువైట్ కన్వీ నర్ ముమ్మడి బాలరెడ్డి, కో కన్వీనర్లు, అడ్వైజర్లు, కమిటీ సభ్యులు ముఖ్యపాత్ర పోషించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## భాష్యం విద్యాసంస్థలో ఆట్టహాసంగా జోనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 20 ప్రభాతవార్త



స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

అనంతపురం జిల్లాలో ఉన్నటువంటి భాష్యం విద్యాసంస్థల్లో శనివారం పిటిసి గ్రౌండ్‌లో అట్టహాసంగా స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అడిషనల్ ఎస్పీ రిటైర్డ్ మల్లికార్జున వర్మ పాల్గొని ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. క్రీడల్లో ఓటమి గెలుపు అనేది సర్వసాధారణమని ఓటమినైన గెలుపు నైనా సమానంగా స్వీకరించాలని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న భాష్యం విద్యాసంస్థలను అభినందించారు. అనంతపురం జిల్లా జడివో రవి వర్మ గారు మాట్లాడుతూ ..ఈ స్పోర్ట్స్ మీట్‌లో మొదటి రోజులో భాగంగా బాలికలకు కోకో జూనియర్ అండ్ సీనియర్, జూనియర్ అండ్ సీనియర్ త్రో బాల్ జూనియర్ అండ్ సీనియర్ చెస్ జూనియర్ అండ్ సీనియర్ క్యారమ్స్ జూనియర్ అండ్ సీనియర్స్ విభాగాలలో పోటీలు జరుగుతాయని తెలియజేశారు. భాష్యం విద్యాసంస్థల అనంతపురం-1 బ్రాంచ్ ప్రిన్సిపల్ బాలకృష్ణ మాట్లా డుతూ. .విద్యార్థులు మానసికంగా శారీరకంగా బలంగా ఉన్న ప్పుడు మాత్రమే విద్యను సునాయాసంగా నేర్చుకోగల రని ఆయన మాట్లాడారు. భాష్యం విద్యా సంస్థల్లో విద్య ను పూర్తి చేసుకునే రోజుకి విద్యార్థులను అన్ని రంగా లలో అభివృద్ధి చేసే ఏకైక విద్యాసంస్థ భాష్యం ఇలాంటి కార్యక్రమాలను నడిపిస్తున్నటువంటి భాష్యం విద్యా సంస్థల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో చైర్మ న్ భాష్యం రామకృష్ణగారు, వైస్ చైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ రామ్, అనంతపురం జిల్లా జడివో రవివర్మ, ప్రిన్సిపల్ బాలకృష్ణ, ప్రణీత, అశోక్, జోత్స్న, సిబ్బంది పాల్గొని, విద్యార్థులను అభినందించారు.

## వైసిపి ఫ్లెక్సీలు తొలగింపుపై నేతల ఆగ్రహం

అనంతపురం సిటీ, డిసెంబర్ 20 ప్రభాతవార్త



అధికారులను నిలదీస్తున్న వైసిపి నేతలు

- మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నగరంలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులు తొలగించడం పట్ల వైసిపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో మాజీ సీఎం జన్మదినం సందర్భంగా ఆపార్టీ నేతలు పలుచోట్ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు శనివారం ఉదయం వాటిని తొలగిస్తుండటంతో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి, యువజన విభాగం నాయకులు వినిత్‌తో కలిసి అక్కడకు ఫ్లెక్సీలు తొలగి స్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులను అడ్డుకున్నారు.

ఆదివారం మాజీ సీఎం జగన్‌మో హన్‌రెడ్డి జన్మదినం జరుగుతుంటే ఒక్క రోజు ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఏ విధంగా తొలగిస్తారని వారు ప్రశ్నించారు. తమ పై అధికారుల సూచనల మేరకే తొలగిస్తున్నామని చెప్పగా ఉన్నతాధికారులను సైతం సంప్రదించి వారి వైఖరిని ప్రశ్నించారు. నగరమంతా విచ్చల విడిగా టీడీపీ నేతలు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు మీకు కనపడవా అని వారు ప్రశ్నిం చారు. అయితే వాటిని ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సూచించి నప్ప టికీ తొలగించిన ఫ్లెక్సీల ఖర్చు ఎవరు భరిస్తారని వారు ప్రశ్నిం చారు. తొలగించిన ఫ్లెక్సీలను అధికారులు వెనక్కి ఇచ్చి అక్కడి నుంచి విస్రమించారు. ఈ సందర్భంగా వైసిపి రాష్ట్ర సం యుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి మాట్లాడుతూ.. టీడీపీ నేతలు అధికారులను అడ్డుపెట్టుకుని వైసిపి ఫ్లెక్సీలను తొలగించారని విమర్శించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరా మిరెడ్డి చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుండటంతో ఓర్వలేకనే ఫ్లెక్సీల తొలగింపు చేస్తున్నా రని విమర్శించారు. కూటమి నేతలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజా మద్దతుతో వైసిపి కార్యక్రమాలు విజయవంతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## విద్యుత్ పొదుపులో రాష్ట్ర అవార్డును సాధించిన జెఎన్‌టియుఏ

అనంతపురం సిటీ, డిసెంబర్ 20 ప్రభాతవార్త



అవార్డును అందుకుంటున్న జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు

విద్యుత్ పొదుపులో జెఎన్‌టియుఏ ఆదర్శంగా నిలిచి రాష్ట్రస్థాయి అవార్డును సాధించింది. విజయవాడలో శనివారం నిర్వహించిన ఏపి స్టేట్ ఎనర్జీ కంజర్వేషన్ మిషన్ అవార్డుల ప్రధానోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చేతులు మీదుగా జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు అవార్డును అందుకున్నారు. ఏపి స్టేట్ ఎ నర్జీ కంజర్వేషన్ గోల్డ్ అవార్డును జెఎన్‌టియుఏ సాధించడం పట్ల జెఎన్‌టియుఏ యంత్రా ంగాన్ని రాష్ట్ర అధికారులు అభినందించారు. ప్రధానంగా జెఎన్‌టి యుఏలో విద్యుత్ సంస్కరణలను పాటించి సోలార్ విద్యుత్ ద్వారా స్వయం విద్యుత్ ఉత్పత్తి ఏర్పాటు, ఎల్ఇడి వీధిలైట్లు ఏర్పాటు, ట్యూబ్‌లైట్ల స్థానంలో సైతం ఎల్ఇడి లైట్లు ఏర్పాటు చేయడం, ఆటో మేటిక్ హై ల్యాంప్ ఆన్ అండ్ ఆఫ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా కార్బన్ డై యాక్సైడ్‌ను 2800 టన్నులు తగ్గించడం సాధ్యమైం దని జెఎన్‌టియుఏ విసి సుద ర్శన్‌రావు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి అవార్డుకు సిబ్బంది సహ కారం కీలకం అన్నారు. అవార్డు ప్రధానోత్సవంలో ఏపిసి పిడిసిఎల్ సిఎండి పుల్లారెడ్డి, ఏపిసెమ్ సిఇఒ నాగలక్ష్మిలు పాల్గొనగా జెఎన్‌టియుఏ రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఇఇఇ హెచ్ఓడి డా.రామ్ శేఖర్‌రెడ్డి, ఏఇఇ శ్యాం బాబులు అవార్డు అందుకున్న కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దానాల్లో కెల్లా అన్నదానం గొప్పది

### - డా.జయనందన రెడ్డి

శింగనమల, డిసెంబర్ 20 ప్రభాతవార్త

మండల పరిధిలోని రుషి స్పంగ మహాముని శ్రీ రంగరాయల జ్ఞాపకార్థం 25వ శనివారం అన్నదాన కార్యక్రమానికి సత్యసాయి జిల్లా ప్రముఖ దినపత్రిక బ్యూరో ఇన్‌చార్జ్ డా.జయనందన్‌రెడ్డి చేయూతనందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శింగనమల ఎంపిడిఓ భాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దానాల్లోకెళ్ల అన్నదా నం మహా గొప్పదని ఆకలిగా ఉన్నవారికి అన్నం పెట్టడం మహా అదృశ్యం అన్నారు. ఈ శనివారం తనకు అవకాశం కల్పించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం డాక్టర్ జయనందన్‌రెడ్డిని స్వామివారి సన్నిధిలో శాలువాతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని ఎంపిడిఓ భాస్కర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రామ్‌చరణ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

## ఏపి మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు

శింగనమల, డిసెంబర్ 20 ప్రభాతవార్త

జనవరి రెండవ వారంలో రాష్ట్ర ప్రభుత్వం కంది కొనుగోలు కేంద్రం ఏపి మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో మండలంలో నిర్వహిస్తున్నట్లు ఏఓ ఎన్.అన్వేష్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ గత ఖరీఫ్ 2025లో కంది సాగు చేసి ఈ పంట నమోదు చేసుకున్న రైతుల మీ గ్రామ రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. అదే విధంగాప్రస్తుత రబీ-2025-26 సీజన్‌లో సాగు చేసినవ ంటలను ఈ పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం

అనంతపురం వైద్యం, డిశంబర్ 20 ప్రభాతవార్త



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యంతో ఎక్సైజ్ శాఖా సిబ్బంది

అనంతపురం ప్రోహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో టివిటవర్ వద్ద బుడ్డప్ప నగర్ కి చెందిన షికారి నాగు అక్రమంగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యం ను తరలిస్తుండగా సదరు వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుండి 672 టెట్రా పాకెట్స్(90ఎంఎల్) కర్ణాటక మద్యము, ఒక బజాజ్ ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులలో అనంతపురం టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ కె.జయనాథ్ రెడ్డి, వారి సిబ్బంది సి.మురళి, రఘునాథ్, నాగలింగమయ్య, మంజువాణి, శాంతమ్మ అనంతపురం ఎక్సైజ్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ జాకీర్ హుస్సేన్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## .గార్లదిన్నె గ్రామపంచాయతీలో విజయవంతంగా స్వచ్ఛ్ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం.

గార్లదిన్నె, డిసెంబర్ 20,ప్రభాతవార్త:



స్వచ్ఛ్ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

గార్లదిన్నె గ్రామపంచాయతీ పరిధిలో శనివారం స్వచ్ఛ్ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డి.ఎల్.పి.ఓ అధికారి విజయ్ కుమార్ రెడ్డి, ఎంపీడీవో అధికారి ఏం గోపాల్, మండల స్థాయి అధికారులు హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా సర్క్యులర్ ఎకానమీపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామసభ నిర్వహించి స్వచ్ఛత, వ్యర్థాల సమర్థ నిర్వహణ, ప్రజల భాగస్వామ్యం వంటి ముఖ్య అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.

ఈ కార్యక్ర మంలో గార్లదిన్నె పంచాయతీ కార్యదర్శి ఖాదర్ వలి, గ్రామ ప్రజలు, గ్రామ సర్పంచ్, వార్డు మెంబర్లు, అంగన్వాడి టీచర్లు, సచివా లయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, ఆనిమేటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ విధంగా స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ స్వచ్ఛ్ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం గార్లదిన్నె గ్రామపంచాయతీ పరిధిలో ఘనంగా ముగిసింది...

## నేడు పీపుల్స్ హెల్త్ సొసైటి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం

అనంతపురం, డిసెంబర్ 20 ప్రభాతవార్త బ్యూరో

పీపుల్స్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో రాజీవ్‌కాలనీ పంచాయితీ పరిధిలోని మహదేవ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో మెగా ఉచిత వైద్యశిబిరం ఈనెల 21న షుగర్, బిపి, చర్మ, కంటి, చెవి, గొంతు, ముక్కు, స్త్రీ, గైనిక్, ఆరోగ్య, ఇతర ఆరోగ్య సమస్యలపై మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పీపుల్స్ హెల్త్ సొసైటీ, యం.బాల రంగయ్య, కన్వీనర్ సభ్యులు మసూద్, బాలకృష్ణ, అశ్విని లు ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఈ వైద్యశిబిరంలో మంచి అనుభవం ఉన్న డాక్టర్లు హాజరవుతారని, ఈ మెగా వైద్య శిబిరం పట్టణంలోని ప్రజలు పాల్గొని తమ ఆరోగ్య సమస్యలకు డాక్టర్ల వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరుతున్నామన్నారు. బిపి, షుగర్, కంటి పరీక్షలు చేస్తారు.

వచ్చేటప్పుడు తమ పాత రిపోర్టులు వెంట తీసుకొని రాగలరు. ఈ మెగా వైద్య శిబిరంలో డాక్టర్ ప్రసూన-గైనకాలజిస్టు, డాక్టర్ నిరంజన్ చెవి, గొంతు, ముక్కు వైద్యులు,డాక్టర్ పవిత్ర డర్మిటాలజిస్టు, డాక్టర్ సుచిత్ర గైనకాలజిస్టు, డాక్టర్ పి.గోపాల్-కంటి వైద్యులు,డాక్టర్ కిషోర్ జనరల్ ఫిజిషియన్‌లు పాల్గొంటారు. మీరు ఉచిత మెగా వైద్య శిబిరంలో పాల్గొనాలి.

## ఆల్ ఇండియా ఇంజనీరింగ్ సర్వీస్ ర్యాంకర్‌కు సన్మానం : ఆపస్

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 20 ప్రభాతవార్త



ర్యాంకు సాధించిన తాళ్లూరు హరి కృష్ణను అభినందిస్తున్న ఆపస్ నేతలు

అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం సిద్దరాంపురం గ్రామ నివాసి అయిన ఆపస్ రాష్ట్ర సలహాదారులు తాళ్లూరు వెంకటేశ్వర ప్రసాద్ (రిటైర్డ్ టీచర్) నిర్మల, రెండవ పుత్రుడైన తాళ్లూరు హరికృష్ణ ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీస్ పరీక్షలో ఆల్ ఇండియా 22వ ర్యాంకు సాధించారు. శనివారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అనంతపురం జిల్లా శాఖ పక్షాన తాళ్లూరు హరికృష్ణను, ఇంత స్థాయికి వచ్చే విధంగా ప్రోత్సాహం అందించిన తల్లిదం డ్రులను ఘనంగా సన్మానించారు. మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ స్థాయికి వచ్చే విధంగా విద్యను అందించిన గురువులందరికీ కూడా ఆపస్ తరపున ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేంద్రప్ర సాద్, అనంతపురం అధ్యక్షు రాలు కళ్యాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు, పి.శివ ప్రసాద్ నాయుడు, హర్షవర్ధన్, రామన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు, దాసరి వరదరా జులు, మల్లోబన్న, పోతులయ్య, హరికృష్ణ, వేణుగోపాల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## నగరంలోని 26వ డివిజన్‌లో ఘనంగా మాజీ సీఎం జన్మదిన వేడుకలు

అనంతపురం సిటీ, డిసెంబర్ 20 ప్రభాతవార్త



భారీ కేక్ కట్ నిర్వహిస్తున్న వైసిపి నేతలు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరిం చుకుని నగరంలోని 26వ డివిజన్‌లో వైసిపి నేతలు ముందస్తుగా భారీ కేక్‌ను కట్ చేశారు. 26వ డివిజన్ వైసిపి నేత నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్‌ను ఏర్పాటు చేసి నేతల సమక్షంలో కేక్‌కటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసిపి ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాలకు మేలు చేకూర్చిందన్నారు. గతానికి భిన్నంగా ప్రజల ముంగిటకే సంక్షేమ పథ కాలు అందించిన ఘనత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని కొనియాడారు. కార్యక్రమంలో వైసిపి నేతలు వెంకటరెడ్డి, రాజారెడ్డి, రామకృష్ణ, నాగార్జున, హనుమంతరెడ్డి, రాజశేఖర్, రమణ, వలి, విష్ణువర్ధన్‌రెడ్డి, సూరి, ప్రకాష్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## రఘు సైనిక్ స్కూల్ విద్యార్థిని అభినందించిన కలెక్టర్

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 20 ప్రభాతవార్త



విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్ ఓ.ఆనంద్

ఈ నెల 15వ తేదీన సౌత్ ఆఫ్రికాలో జరిగిన అంతర్జాతీయ యుఐపిఎం (స్విమ్మింగ్, షూటిం గ్, రన్నింగ్‌లో) ట్రైథలాన్ వరల్డ్ ఛాంపియన్ షిప్‌లో రఘు సైనిక్ స్కూల్‌లో 10వ తరగతి చదువు తున్న ఎంఎస్ఎస్ జశ్విన్ నాయు డు కాంస్య పథకం సాధించారు. ఈ సందర్భంగా ఆ విద్యా ర్థిని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రఘు సైనిక్ స్కూల్ డైరెక్టర్లు రాఘవేంద్ర, గురుప్రసాద్, లోకేష్ పాల్గొన్నారు.

## సచివాలయ సిబ్బంది సమన్వయంతో పని చేయాలి

### - ఎంపిడిఓ పార్థసారధి

నంబులపూలకుంట, డిసెంబర్ 20 ప్రభాతవార్త



మాట్లాడుతున్న ఎంపిడిఓ పార్థసారధి

గ్రామ సచివాలయ సిబ్బంది కలిసికట్టుగా అన్ని శాఖల అధికా రులు సమన్వయంతో స్వమిత్వ ప్రోగ్రాంలో పని చేయాలని ఎంపిడిఓ పార్థసారధి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం సచి వాలయ సిబ్బందితో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ ..సచివాలయ సిబ్బం దికి ఇరవై ఏడు రకాల అంశాల పనులను ప్రభుత్వం వారికి కేటాయించిందని తెలిపారు. వీటన్నింటిని సిబ్బంది కలిసి కట్టుగా పని చేసినప్పుడే మండ లానికి గుర్తింపు తెస్తారన్నారు. ఈ కార్యక్రమ ంలో డిప్యూటీ ఎంపిడిఓలు మాధవరెడ్డి, దేవదర్శన్‌రెడ్డి, పంచాయితీ కార్యద ర్శిలు, విఆర్ఓలు, డిజిటల్ అసిస్టెంట్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.


**ANANTAPURAMU MUNICIPAL CORPORATION**
**e-PROCUREMENT - Tender Notice**

| | | |
|---|---|---|
| 1. | Tender Notice No | **303 to 324/General Funds/NCAP/ 2025-26/TO** |
| 2. | Scope of work | Engaging of Tractors, Beautification and development, providing Road, Drain and other development works in various places in Anantapuramu Municipal Corporation |
| 3. | No. of Works | **22 Nos.** |
| 4. | Estimate Cost Ranging | **Rs. 2.30 to 100.00 Lakhs** |

**Note :** The details of tender may be seen on e - procurement market Place available @ https://tender.apeprocurement.gov.in.

**sd/- Commissioner, Municipal Corporation, Anantapuramu**

**ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్**

హిందూపురం (1933) బ్రాంచ్ , డి.నెం.4-7-33, నవ్మీ ప్లాజా, మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా, రామంతపూర్ సర్కిల్, హిందూపురం - 515201, శ్రీ సత్యసాయి జిల్లా, ఆంధ్రప్రదేశ్. Ph: 8754145102 & E-mail ID : iob1933@iob.in

**డిమాండ్ నోటీసు**

1) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు-2002 (రూల్సు) యొక్క 3(1) రూలుతో కూడిన సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు-2002 (SARFAESI చట్టం) యొక్క 13(2) విభాగం ప్రకారం.
2) SARFAESI చట్టం ప్రకారం క్రింది సంతకందారు **ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్** యొక్క అధీకృత అధికారిగా మరియు నియమావళి యొక్క 3వ నియమంతో కూడిన 13(2) విభాగం క్రింద సంక్రమించిన అధికారాలతో సదరు చట్టం 13(2) విభాగం ప్రకారం దిగువ జాబితాలో పేర్కొనబడిన ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారులు (ఇప్పటి నుండి ఋణగ్రహీతలుగా పరిగణింపబడతారు)లు క్రింద తెలిపిన వివరాలు ప్రకారం నోటీసులో తెలుపబడిన మొత్తములను నోటీసు స్వీకరణ తేది నుండి 60 దినములలోగా చెల్లింపు చేయవలసినదిగా డిమాండ్ నోటీసు జారీ చేసినారు.
సదరు నోటీసులు బట్వాడా కాకుండా పోస్టల్ అథారిటీ వారిచే తిరిగి వచ్చినవి లేదా ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారులు స్వీకరించినట్లు ధృవీకరించ లేదు. కనుక డిమాండ్ నోటీసు ప్రచురణను విస్తృతపరమైన హెచ్చరిక నిమిత్తం బ్యాంకు చేపట్టినది. సదరు చట్టం ప్రకారం సదరు ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారులు యొక్క చివరగా తెలిసిన చిరునామాల ఆవరణముల యందు ఈ నోటీసులను దిగువ సంతకందారు అతికించినారు. సదరు నోటీసు కాపీలు దిగువ సంతకందారుని వద్ద లభిస్తాయి మరియు ఈ నోటీసు కాపీలను పొందగోరిన సదరు ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారులు దిగువ సంతకందారు నుండి ఏపనిదినమునైనా సాధారణ ఆఫీసు వేళలలో పొందవచ్చును.
3) పై నేపథ్యం (అంశము) ఆధారంగా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 దినములలోగా ఈ దిగువ సూచించిన మొత్తములు సదరు తేది నుండి ఋణం మరియు ఇతర డాక్యుమెంట్ల ప్రకారం చెల్లింపు చేయు తేది వరకు ఒప్పందపు రేట్ల ప్రకారం భవిష్యత్తు వడ్డీతో సహా **ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు** వారికి చెల్లించవలసినదిగా సదరు ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారులను మరొకసారి ఈప్రకటన మూలముగా కోరటమైనది. ఋణబాకాయిలు తిరిగి చెల్లింపు చేయు నిమిత్తం సెక్యూరిటీగా దిగువతెలిపిన ఆస్తులను సంబంధిత ఋణగ్రహీతలు **ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు** వారికి తనఖాపెట్టియున్నారు.

| ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారుల పేర్లు మరియు చిరునామా | తేది.30.11.2025 నాటికి బకాయి మొత్తం* | సెక్యూర్డ్ ఆస్తుల వివరణ (సెక్యూరిటీ స్వభావం : హైపోథికేషన్/తనఖా) | డిమాండ్ నోటీసు తేది |
|---|---|---|---|
| **ఋణగ్రహీత/తనఖాదారు:** డి.బిలాల్, తండ్రి: అబ్దుల్ హమీద్ సాబ్, 18-12-47సి, అజాద్ నగర్, హిందూపూర్, శ్రీ సత్యసాయి డిస్ట్రిక్ట్-515201. **హామీదారు/తనఖాదారు:** ఎస్.సలావుద్దీన్, తండ్రి: లేటు కరీమ్ సాబ్, డి.నెం.4-141, కె.బసవనపల్లి, కిరికెర-515211. **ఎస్ఎల్ ఎన్‌సిజి - 193303311300098, ఎన్‌పిఎ తేది : 01.04.2014** | రూ. **21,74,558.00/-** + కాంట్రాక్చువల్ రేటు ప్రకారం నెలసరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు. | **తనఖా:** కొలెట్రాల్ సెక్యూరిటీ: శ్రీ సత్యసాయి జిల్లా - 515211, హిందూపురం మండలం, కిరికెర పంచాయితీ ఏరియా, సర్వే నెం.52-10బిలోని డి.నెం.4-145తో గల నివాస భూమి మరియు భవనం శ్రీ ఎస్.సుల్తాన్ సలావుద్దీన్ గారి పేరున కలదు. **హద్దులు: ఉత్తరం :** రోడ్డు, **దక్షిణం :** ఓ ఎం రామి రెడ్డి గారి భూమి, **తూర్పు :** బాబి రెడ్డి గారి భూమి, **పడమర :** కృష్ణప్ప మరియు ఇతరుల భూమి. | **17-12-2025** |

* పైన తెలిపిన తేది నుండి చెల్లింపుచేయు తేది వరకు అంగీకరించిన ఒప్పందపు రేట్ల ప్రకారం తదుపరి వడ్డీ / మిగిలినవి చెల్లించాలి.
4) పైన చెప్పినట్లుగా ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ వారికి చెల్లింపు చేయుటలో సదరు ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారులు విఫలమైనచో, **SARFAESI** చట్టం 13(4) విభాగం మరియు సదరు నియమావళి ప్రకారం **ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్** వారు పై సెక్యూర్డ్ ఆస్తులపై తగు చర్యలు చేపట్టెదరు మరియు అందుకు ఎదురయ్యే అన్ని ఖర్చులు మరియు పరిణామములకు సదరు ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారులు బాధ్యులగుదురు.
5) ఇంకను తెలియపరచునది ఏమనగా, చట్టంలోని 13వ విభాగంలోని ఉపవిభాగం (8) నియమములు క్రింద లభించే సంబంధిత కాలం పరిధిలో తమ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోవలసినదిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.
6) అలాగే **ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు** వారి ముందస్తు లిఖిత అనుమతి లేకుండా అమ్మకం, లీజు లేదా ఇతరత్రా మార్గముల ద్వారా సెక్యూర్డ్ ఆస్తులను మీరు బదిలీ చేయుట **SARFAESI** చట్టం ప్రకారం నిషేధించటమైనది. ఏ వ్యక్తి అయిన చట్టం లేదా నియమావళి లోని నియమాలను ఉల్లంఘించిన లేదా వ్యతిరేకతను ప్రోత్సహించిన సదరు చట్టంలోని 29వ విభాగం ప్రకారం జైలు శిక్ష మరియు / లేదా జరిమానా విధించబడుతుంది.

**తేది : 17-12-2025, స్థలం : హిందూపురం** **సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్**

04ATP20_04ATP20.qxd 20-12-2025 PM 11:21 Page 1



# టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే పరిటాల సునీత పరామర్శ

## - పలు ఆసుపత్రులకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా
## - రూ.4.50లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేసిన ఎమ్మెల్యే సునీత

రామగిరి, డిసెంబర్ 20 ప్రభాతవార్త

రోడ్డు ప్రమాదాల్లో గాయపడటంతో పాటు వివిధ కారణాలతో ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్న టీడీపీ నాయకులను ఎమ్మెల్యే పరిటాల సునీత పరామర్శించారు. రాప్తాడు నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, రామగిరి మండల మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు, హిందూపురం పార్లమెంటు బిసి సెల్ అధ్యక్షుడైన బడముద్దల రంగయ్య రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. గాయాలతో అనంతపురంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న రంగయ్యను ఎమ్మెల్యే సునీత పరామర్శించారు.

ప్రమాదం ఎలా జరిగింది.. ప్రస్తుతం ఎలా ఉందన్నది అడిగి తెలుసుకున్నారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. అలాగే వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్సలు అందించాలని సూచించారు. అలాగే రామగిరి మండలం కంచికుంట గ్రామానికి చెందిన గొల్ల వరుణ్ కుమార్ వారం రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాద ంలో గాయపడ్డారు. అనంతపురంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొం దుతుండగా ఎమ్మెల్యే సునీత పరామర్శించారు. ఆయనకు అత్యవసరంగా ఆపరేషన్ చేయాల్సి ఉండగా.. వైద్య సహాయం నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ద్వారా వచ్చిన రూ.4.50 లక్షల ఎల్‌ఓసిని కుటుంబ సభ్యులకు అందజేశారు. అవసరమైతే ప్రభుత్వం నుంచి మరింత సాయం అందిస్తామని అధైర్య పడవద్దని వారికి సూచించారు. మరోవైపు అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతున్న తోపుదుర్తి గ్రామానికి చెందిన ఆదినారాయణను కూడా పరామర్శించారు. టీడీపీ నాయకులు త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

# పారిశుద్ధ్య కార్మికులు లేని ఊళ్లను ఊహించలేం వారుంటేనే గ్రామాలు, పట్టణాల పరిశుభ్రత

## స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత
## పాపంపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ,పారిశుద్ధ్య కార్మికులను ప్రతి ఒక్కరూ గౌరవించాలి : ఎమ్మెల్యే

అనంతపురం రూరల్, డిసెంబర్ 20 ప్రభాతవార్త :

పారిశుద్ధ్య కార్మికులు లేని ఊళ్లను ఊహించలేమని వారుంటేనే గ్రామాలైనా పట్టణాలైనా పరిశుభ్రంగా ఉంటాయని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురం రూరల్ మండలం నారాయణపురం గ్రామ పంచాయతీలోని పాపంపేటలో జరిగిన స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొ న్నారు. పారిశుద్ధ్య కార్మికులతో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. మా పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకుంటామంటూ ప్రజలతో కలిసి మానహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పాపంపేట సచివాలయం పరిధిలో సమావేశం ఏర్పాటు చేసి అక్కడ ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం తర్వాత చెత్త సేకరణ కోసం తోపుడు బండ్లు, డస్ట్ బిన్లను, కార్మికులకు గ్లౌస్ లు, జాకెట్లను పంపిణీ చేశారు. ఆ తర్వాత కార్మికులతో కలిసి తేనీటి విందులో పాల్గొని.. వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. విధులలో ఎటువంటి ఆటంకం కలిగినా మా దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సునీత సూచించారు. గ్రామ పంచాయతీలో తయారు చేసిన వర్మీ కంపోస్ట్ ను ఎమ్మెల్యే కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పంచాయతీ కార్మికులు చాలా కృషి చేస్తున్నారన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఒక్క రోజు విధులకు రాకపోయినా ఆ ప్రభావం మనకు కనిపిస్తుందన్నారు. వారు చేసే పనికి మనం ఎంత ఇచ్చినా తక్కువే అవుతుందన్నారు. అందుకే ప్రజలంతా కార్మికులకు కృతజ్ఞతతో ఉండటంతో పాటు గౌరవం చూపాలన్నారు. గ్రామాల్లో కొన్ని చోట్ల పారిశుద్ధ్య పనులకు సహకరించడం లేదని.. ప్రతి ఒక్కరూ సహకారం అందిస్తూ.. స్వీయ శుభ్రతా చర్యలు తీసుకుంటేనే గ్రామాలు బాగుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డియల్‌డిఓ నాగ శివ లీల, ఎం పీడీవో దివాకర్, డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు, నారాయణపురం స్పెషల్ ఆఫీసర్ సురేష్, పంచాయతీ కార్య దర్శి సర్దార్ వలి, రఘు, మండల కన్వీనర్ సూర్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు, స్థానిక మండల నాయకులు, మహిళలు, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లా డు తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, తడి పొడి చెత్త సేకరణ డస్ట్ బిన్లను పరిశీలిస్తున్న దృశ్యం.

# పర్యవరణ పరిరక్షణతో ఉపాధి అవకాశాలు

## - స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర దిశగా విస్తృత అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

కదిరి, డిసెంబర్ 20 ప్రభాతవార్త

ప్రతి నెలా 3వ శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర డే కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని రోడ్లు భవనాల అతిథి గృహ ంలో విస్తృత స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్ర మంలో సత్య సాయి జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. తడి చెత్త, పొడిచెత్త వేరు చేయడం ఘన ద్రవ వ్యర్థాల నిర్వాహణ, పర్యవరణ రంగంలో నైపుణ్యాభివృద్ధి వ్యర్థాలను వనరు లుగా మలు చుకుని వాణిజ్య అవకాశాలు వంటి అంశాలపై పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు. అవగాహన ర్యాలీలో పరిసరాలు, నివాసాల నుంచి ఉత్పన్నమయ్యే వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ శుభ్రమైన ఆంధ్రప్రదే శ్ సాధనకు ప్రతి ఒక్కరు బాధ్య త వహించాలంటూ ప్రతిజ్ఞ నిర్వ హించారు. కార్యక్రమంలో ము న్సిపల్ చైర్‌పర్సన్ ది ల్షాదున్నీ సా బాహుద్దీన్, స్వచ్ఛాంధ్ర కా ర్పోరేషన్ డైరెక్టర్ పర్వీన్ భాను, ము న్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, వివి ధ శాఖల అధికా రులు పాల్గొన్నారు.

# కేఎస్‌ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు రాష్ట్రస్థాయి తృతీయ బహుమతి

అనంతపురం, డిసెంబర్ 20 ప్రభాతవార్త బ్యూరో

రాష్ట్రస్థాయిలో ఈనెల 18, 19, 20 తేదీల్లో జరిగిన యువజ నోత్సవాల్లో భాగంగా శ్రీ సత్య సాయి జిల్లా నుండి కె.ఎస్.ఎన్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని చక్కని ప్రతిభ చాటారు. రాష్ట్రస్థా యిలో తృతీయ బహుమతి సాధించి అందరి చేత శభాష్ అనిపించుకున్నారు.. ఈ బహుమతిని మన రాష్ట్ర యువజన క్రీడల శాఖల మరియు రవాణా శాఖ మంత్రి యం.రాంప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా కే ఎస్ ఎన్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు అందుకున్నారు. విజయవాడలో ఉన్న అనేక సోషల్ మీడియా సంస్థలు, మా విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ ఎంతగానో సంతోషించి విద్యార్థులను అభినందించారు. ఇంత చక్కని ప్రదర్శన చేసినందుకుగాను కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మహమ్మద్ షఫీ, అధ్యాపకులు అధ్యాపకేతరులు ప్రత్యేకంగా బహుమతి సాధిం చిన విద్యార్థులను అభినందించారు. యువజన ఉత్సవాల్లో తృతీయ బహు మతి సాధించిన విద్యార్థులు కె.మనీషా, సి.అమృత, వి.స్పందన, ఎం.రజిత, ఎస్. కీర్తన, ఎం.ఇందు, ఎం.శరణ్య, బి.మేఘ సింధు, ఎ.మనీషా, జి.లక్ష్మి, మోనిక, లావణ్య, హిమబిందు, చిన్ని తదితరు లున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు బి.రామ కృష్ణ, డాన్స్ మాస్టర్ ఏ.సుబ్రహ్మణ్యం, డప్పు మాస్టర్ నాగభూషణ, ఫ్లూట్ వాయుద్యుడు లక్ష్మినారాయణ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

# వైజ్ఞానిక ప్రదర్శనలు భావి శాస్త్రవేత్తలుగా ఎదగడానికి దోహదం చేస్తాయి









వైజ్ఞానిక ప్రదర్శనలో వివిధ నమూనాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

బుక్కపట్నం, డిసెంబరు 20, ప్రభాతవార్త

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ఆవిష్కరణా శక్తిని పెంపొందించడంతోపాటు భావి పరిశోధకులు శాస్త్రవేత్తలుగా ఎదగడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం బుక్కపట్నం డైట్ కళాశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన లో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు సమస్యలను గుర్తించి శాస్త్రీయ పరిష్కారాలను ప్రతిపాదించడమే నిజమైన విజ్ఞానం అని పేర్కొన్నారు.

ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి 250 కు పైగా శాస్త్రీయ ప్రాజెక్టులు ప్రదర్శనకు వచ్చాయని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు వ్యవసాయం, నీటి నిర్వహణ, పర్యావరణం, గ్రీన్ ఎనర్జీ, ఆరోగ్యం, గణితం, ఆధునిక సాంకేతికత వంటి విభిన్న రంగాల్లో వినూత్న ఆలోచనలతో రూపొందించిన ప్రాజెక్టులు ప్రశంస నీయమన్నారు. సైన్స్ ఫెయిర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి క్రిష్టప్ప, అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస రావు, వినయ్ మోహన్, లాజరస్ సూపరింటెండెంట్ ప్రసాద్, స్టేట్ లైవ్ స్టాక్ డైరెక్టర్ జి. వెంకటేష్, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు ఆర్. వెంకటరమణ, సోమశేఖర్, డైరెక్టర్ బండారు మనోహర్ నాయుడు, పూల శివప్రసాద్, డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్, సామకోటి ఆదినారాయణ, రామకృష్ణ చౌదరి, ఎం. చౌదరి, పెనుగొండ డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కే. జాన్ రెడ్డప్ప, తదితరులు సందర్శించి విద్యార్థులను అభినందించారు. ప్రథమ స్థానాలు సాధించిన ప్రతిభావం తులుసస్టైనబుల్ అగ్రికల్చర్‌లో వర్షిని, జడ్.పీ.హెచ్.ఎస్. దేముకేతపల్లి, వాటర్ మేనేజ్మెంట్ ఆల్టర్నేటివ్స్ టు ప్లాస్టిక్ లో చరణ్, తేజస్విని , జడ్.పీ.హెచ్.ఎస్. గుండుమల, గ్రీన్ ఎనర్జీ లో పి. శబరిష్, హేమంత్ , జడ్.పీ.హెచ్.ఎస్. కోటిపి. ఎమర్జింగ్ టెక్నాల జీస్ లో కిరణ్, జస్వంత్ , జడ్.పీ.హెచ్.ఎస్. మహమ్మదాబాద్, రిక్రియే షనల్ మ్యాథమెటికల్ మోడలింగ్‌లో బిందు శ్రీ, ఉదయ్ కుమార్, జడ్.పీ.హెచ్.ఎస్. గోరేవాళ్లపల్లి హెల్త్ అండ్ హైజిన్లో నవ్య, మంజు దీపు , జడ్.పీ.హెచ్.ఎస్. ఇరిగేపల్లి, వాటర్ కన్జర్వేషన్ మేనేజ్మెంట్లో పి. యశ్వంత్ జగన్నా థ్ - ఎం.జె.పీ. లేపాక్షి, వ్యక్తిగత విభాగంలో, ఎన్విరాన్మె ంటల్ సైన్స్: కౌసల్య , జడ్.పీ.హెచ్.ఎస్. సోమందేపల్లి, భౌతిక శాస్త్రం లో కార్తీక్ , ఏపీ మోడల్ స్కూల్, దేవరెడ్డిపల్లి ఉపాధ్యాయుల విభాగంలో భౌతిక శాస్త్రం (ఏసీ కోచస్), జడ్.పీ.హెచ్.ఎస్. కృష్ణపురం, ఇంజనీరింగ్ రోబోటిక్స్: దినకర్ జడ్.పీ.హెచ్.ఎస్. కొత్తచెరువులు నిలిచారు.

# ప్రజల ముంగిటకే పాలన తెచ్చిన ఘనత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిది

## - ముందస్తు జన్మదిన వేడుకల్లో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం సిటీ, డిసెంబర్ 20 ప్రభాతవార్త

తొలిసారిగా ముఖ్యమంత్రి అయినప్పటికీ ప్రజల ముంగిటకే పరిపాలనను తీసుకొచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాధించారని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని అంబేద్కర్ నగర్‌లో మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వైసిపి మహిళా విభాగం నగర అధ్యక్షురాలు సాకే చంద్రలేఖ, ఎస్సీ సెల్ నాయకులు కుళ్లాయిస్వామి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను నేతలతో కలిసి కట్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహా నేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి తనయుడుగా తొలిసారిగా ముఖ్యమంత్రి అయిన ప్పటికీ తండ్రి అడుగుజాడల్లో పరిపాలనను అందించి దేశానికి ఆదర్శంగా నిలిచేలా పథకాలను అందించి ప్రజల మన్ననలను చూరగొన్నారన్నారు. నాలుగు సార్లు సీఎంగా పని చేసిన చంద్రబాబు నాయుడు అసాధ్యమన్న పనులను వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించి ప్రజల కు సుపరిపాల నను అందిం చారని కొనియాడా రు. నేడు ప్రజలంతా తమ కు టుంబంలో సభ్యుడి జన్మది నం అన్న రీతిలో వైఎస్. జగన్ జన్మ దిన వేడుకలకు సన్నద్ధం అవు తున్నా రని పేర్కొన్నారు. మరోమారు వైఎస్. జగన్ మో హన్‌రెడ్డి సీఎం కావాలన్నది ప్రజ ల ఆకాంక్ష అని అంకిత భావంతో తామంతా పని చేసి ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ మహ్మద్ వసీం, వైసిపి సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి, కార్పొరేటర్ కమల్‌భూషణ్, వైసిపి నేతలు సాకే శోభన్, కేశవరెడ్డి, జానీ, కృష్ణ, ముత్యాలప్ప, రాఘవ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ సెల్ నేతకు కేక్ తినిపిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకట రామిరెడ్డి

# జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 20 ప్రభాతవార్త

జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన శనివారం రాప్తాడు మోడల్ స్కూల్‌లో నిర్వహించారు. అన్ని మండలాల నుంచి 124 ప్రాజెక్టులు ప్రదర్శనకు వచ్చాయి. ప్రదర్శనను ఉదయం జిల్లా విద్యాశాఖాధికారి ఎం.ప్రసాద్ బాబు ప్రారంభించారు. బహుమతి ప్రదానోత్సవమునకు ముఖ్య అతిథిగా అనంతపురము పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మి నారాయణ హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలుగా అనంతపురం ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు, కళ్యాణ దుర్గం డిగ్రీ కళాశాల అధ్యాపకులు హాజరయ్యారు. బహుమతి ప్రదానోత్సవ సభలో పార్లమెంట్ సభ్యులు.. విద్యార్థులందరూ కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకోవాలనీ.. స్థానిక సమస్యలపై పరిష్కారం కనుక్కోవాలనీ.. అందుకు అనుగుణంగా పరిశ్ర మల స్థాపన జరగాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థు లకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

అలాగే 19 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. 23వ తేదీ విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి విజ్ఞ వైజ్ఞా నిక ప్రదర్శనలో ఆ 11 ప్రాజెక్టులు తయారు చేసిన విద్యార్థులు, టీచర్లు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపిసి శైలజ, జిల్లా సైన్స్ అధికారి నరసింహారెడ్డి, పలువురు హెచ్ ఎంలు, సైన్స్ ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న ఎంపి





విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఎంపి అంబికాలక్ష్మినారాయణ

# ఉన్నత శిఖరాలు అధిరోహించి అభివృద్ధికి కృషి చేయాలి

## ఐఇఎస్ హరికృష్ణ ప్రసాద్ కు ఆత్మీయ సన్మానం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, డిసెంబర్ 20 ప్రభాతవార్త:

అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం పీ.సిద్దారంపురం గ్రామానికి చెందిన తాళ్లూరు హరికృష్ణ ప్రసాద్ ।నిళీ లో ఆలిండియా 22వ ర్యాంక్ సాధించడం పట్ల కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే అమిలి నేని సురేంద్ర బాబును అనంతపురంలో హరికృష్ణ ప్రసాద్ మర్యాద పూర్వ కంగా కలిశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సురేంద్రబాబు హరికృష్ణ ప్రసాద్ ను ఘనంగా సన్మానించి మాట్లాడుతూ హరికృష్ణ ప్రసాద్ ఐఇఎస్‌లో 22వ ర్యా ంకు సాధించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో దేశానికి, మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, మన జి ల్లాకు, అందులో మా కళ్యా ణదుర్గం నియోజకవర్గ అభివృ ద్ధికి కూడా కృషి చేయా లని ఆకాం క్షించారు. ఇప్పటికే కళ్యా ణదుర్గంలో జరుగుతున్న అబి వృద్ధికి ఒక అధికారిగా కూడా సహకరించి మరింత అభివృ ద్ధికి తోడ్పడాలని కోరారు.

# నేడు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయండి

## 0 5 ఏళ్ల వయసు ఉన్న పిల్లలందరికీ పోలియో చుక్కలు : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం కలెక్టరేట్ డిసెంబర్ 20 ప్రభాతవార్త

నేడు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పిలుపునిచ్చారు. నేడు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం అనంతపురం నగరంలో ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకు నిర్వహించిన పల్స్ పోలియో అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పచ్చజెండా ఊపి ప్రారంభించి.. ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగిందన్నారు.

జిల్లాలో 2,84,774 మంది చిన్నారులు (05 సంవత్సరాల మధ్య) ఉన్నారని, జిల్లాలోని 31 మండలాల పరిధిలో 51 పిహెచ్సిలు, 25 యూపీహెచ్సీలు, 6 పిపియూ నిట్లు కలుపుకుని మొత్తం 82 యూనిట్లలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహి స్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 1,451, అర్బన్ ప్రాంతాల్లో 334 కలుపుకొని మొత్తం 1,785 పోలింగ్ బూత్‌లలో పల్స్ పోలియో కార్యక్ర మాన్ని నిర్వహించడం జరుగుతుందని, ఇందుకోసం 5,247 మంది సిబ్బం దిని నియమించడం జరిగిందన్నారు. బూత్ యాక్టివిటీని డిసెంబర్ 21వ తేదీన నిర్వహించడం జరుగుతుందని, ఆరోజు మిగిలి పోయిన వారికి ఇంటింటి గృహ సందర్శన యాక్టివిటీని 22వ తేదీ మరియు 22వ తేదీన నిర్వహించడం జరుగుతుందన్నారు. ట్రాన్సిట్ ప్రాంతాలు బస్ స్టేషన్ల, రైల్వే స్టేషన్ల నందు 58 బృందాలు, మొబైల్ టీంలు 68 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని అంగన్వాడీ కేంద్రాలలోనూ ఐఇసి కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని, చిన్నారులు ఎవరు కూడా మిగిలిపోకుండా, అందరికీ పోలియో చుక్కలు వేయించేందుకు అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఈబి.దేవి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శశిభూషణ్ రెడ్డి, జిల్లా మలేరియా అధికారి ఓబులు, హెచ్‌ఈఈఓ త్యాగరాజు, డి ప్యూటీ హెచ్ఇఈ గంగాధర్, వెంకటేష్ వ్యాక్సి న్ స్టోర్ మేనేజర్ డిఎస్వి రాజు, కిరణ్ కుమా ర్, వివిధ నర్సి ంగ్ కళాశాల విద్యార్థినీలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





పల్స్ పోలియోపై ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్

# పోలియో రహిత జిల్లానే లక్ష్యం

## - 0-5 ఏళ్ల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు - జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్

శ్రీ సత్యసాయి జిల్లా (వైద్యము) డిసెంబర్ 20 ప్రభాతవార్త:

జిల్లా వ్యాప్తంగా ఈనెల 21న ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని వందశాతం విజయవంతం చేయాలన్నదే లక్ష్యం అని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ అన్నారు. పల్స్ పోలియో కార్యక్ర మంపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో శనివారం జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గణేష్ సర్కిల్ వరకు నిర్వహించిన పల్స్ పోలియో అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని స్పష్టం చేశారు. పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. శ్రీ సత్య సాయి జిల్లాలో 0-5 సంవత్సరాల లోపు ఉన్న 2,11,391 మంది పిల్లలకు డిసెంబర్ 21న పోలియో చుక్కలు వేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 2037 పోలియో బూతులు, 8140 మంది సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడు తుందని వివరించారు. అలాగే డిసెంబర్ 22, 23 తేదీలలో ఇంటింటి సర్వే నిర్వహించి, పోలియో చుక్కలు పొందని పిల్లలను గుర్తించి ఇంటి వద్దనే చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ ర్యాలీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. ఫైరోజాబేగం ఆధ్వర్యంలో, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ కె. సురేష్ బాబు పర్యవేక్షణ లో నిర్వహించబడింది. ర్యాలీలో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు "నిండు జీవితా నికి రెండే చుక్కలు - పల్స్ పోలియో చుక్కలు", "రేపే పోలియో ఆదివారం" వంటి నినాదాలతో గణేష్ సర్కిల్‌కు చేరుకున్నారు. అక్కడ ఏర్పా టు చేసిన మానవహారంలో జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, స్థానిక వైద్యాధికారులు డాక్టర్ నాగదుర్గ, డాక్టర్ భవ్య యాదవ్, వైద్య ఆరోగ్య సిబ్బ ంది, ఆశా కార్యకర్తలు, ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్



మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న దృశ్యం

# ఇస్తెమా ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కందికుంట

కదిరి, డిసెంబర్ 20 ప్రభాతవార్త

కదిరి పట్టణంలోని నూతన బైపాస్ రోడ్డులో ఈ నెల 27, 28 తేదీల్లో జరగబోతున్న అనంతపురం, హిందూపురం జిల్లాల ఇస్తెమా ఏర్పాట్లను శనివారం ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పరిశీలించారు. ముందుగా విద్యుత్ శాఖ అధికారులు కాంట్రాక్టర్‌తో కలిసి ఇస్తెమా ప్రాంగణంలో విద్యుత్ అంతరాయం లేకుండా, వాహన దారులకు ఇబ్బంది లేకుండా రహదారులకు ఇరువైపులా వీధి దీపాలు, హైమ్యాక్స్ లైట్స్ ఏర్పాటు చేసి ఇస్తెమాకు వచ్చే వారికి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, మున్సిపల్, పంచాయితీ రాజ్ అధికారులు నిరంతరం ఇక్కడే ఉండి ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలలనుంచి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, తహశీల్దారు మురళీకృష్ణ, ఎంపిడిఓ పోలప్ప, విద్యుత్ కాంట్రాక్టర్లు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



ఇస్తెమా ఏర్పాట్లపై ముస్లిం మత పెద్దలు, అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

# కళ్యాణదుర్గం డిఎస్పి రవి బాబుకు బెస్ట్ క్రైమ్ డిటెక్షన్ అవార్డ్

కళ్యాణదుర్గం, డిసెంబర్ 20 ప్రభాతవార్త :

కళ్యాణదుర్గం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో రాయదుర్గం మండలం వేపరాలకు చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ నరసింహప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాంబోడియా దేశం నుండి ఫేక్ యాప్ ల ఆపరేట్ చేస్తూ ఢిల్లీ కేంద్రంగా ఫ్రాడ్ డబ్బును ఫేక్ అకౌంట్లోకి బదలాయించిన ముఠా గుట్టును రాయదుర్గం సైబర్ విభాగం రట్టు చేసింది.

ఈ కేసును చేదించిన జిల్లా ఎస్పీ జగదీష్, కళ్యాణదుర్గం డిఎస్పి రవి బాబు రాయదుర్గం పోలీస్ బృందం డిజిపి హరీష్ కుమార్ గుప్తా చేతుల మీదగా అవార్డ్ ఫర్ బెస్ట్ క్రైమ్ డిటెక్షన్ (తితీదిదీ అవార్డు) అందుకున్నారు. కళ్యాణదుర్గం డిఎస్పి ఈ అవా ర్డును అందుకో వడం పట్ల జిల్లా జర్నలిస్టుల సంఘం ఉపాధ్య క్షులు లింగ ప్రసాద్ ఎల్ఐసి మురళి శుభా కాంక్షలు తెలిపారు.



సైబర్ క్రైమ్ కేసులో అవార్డు అందుకున్న కళ్యాణ్ దుర్గం డిఎస్పి రవిబాబు

# జాతీయరహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

**( మొదటి పేజీ తరువాయి )** గావిగహళ్ళికి చెందిన ఏ.ఆర్.వెంకటాచార్ అతని బార్య గీతమ్మ వారి కుమారుడు కోడలు విష్ణు అక్షిత చిక్‌బళ్ళాపూర్ నుండి కారులో మంత్రాలయం వెళ్తుండగా నీలూరు క్రాస్ వద్ద వేకువజామున మంచుపొగలు అలుముకోవటం డ్రైవర్ నరశింహకు ముందు ఆగివున్న వాహనం కనిపించకపోవటంతో డీ వేగంగా డీ కొట్టడంతో కారు ముందు బాగం పూర్తిగా ధ్వంసమైందన్నారు. ఘటనలో ఏ.ఆర్.వెంకటాచార్ అతని బార్య గీతమ్మ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడ్డ విష్ణు, నరశింహలను గుత్తి, అనంతపురం ప్రభుత్వాసుపత్రులకు తరలించి పోస్టుమార్టం నిమిత్తం మృతి చెందిన వారి మృతదేహాలను పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విష్ణు, నరశింహలు అపస్మారక స్థితిలో ఉన్నారని తెలిపారు. ఏ. ఆర్.వెంకటాచార్ వారి ప్రాంతంలోని ఆంజనేయస్వామి దేవాలయం అర్చకులు కాగా విష్ణు బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అని తెలియజేశారు. వేకువజామున దట్టంగా అలుముకున్న పొగమంచే ప్రమాదానికి ప్రధాన కారణం అంటూ పలువురు చర్చించుకుంటుండటం గమనార్హం. విషయం తెలుసుకున్న అనంతపురం ఎస్పీ జగదీష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి సంఘటన జరిగిన తీరుపై డిఎస్పీ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ సిఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ రవిప్రసాద్‌ను అడిగి తెలుసుకుంటూ రోడ్డు ప్రమాదాల నివారణపై పలు సూచనలు చేశారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.